www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY


RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 166 | శుక్రవారం 07.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



## అదనపు వసూళ్ల పర్వం!

**అక్షరాలను అమ్ముకుంటున్న భకాసురులు..**

**ల్యాబ్, లైబ్రరీ, డెవలప్‌మెంట్ పేరుతో అదనపు ఛార్జీలు**

### ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఏఐసీటీఈకి ఫిర్యాదులు

- ఇంజినీరింగ్ విద్య పేరిట కార్పొరేట్ కళాశాలల దోపిడీ
- అనుమతించిన ఫీజులకు మించి భారీ వసూళ్లు
- 20–30 శాతం అదనపు ఫీజులతో తల్లిదండ్రులపై భారం
- ల్యాబ్, లైబ్రరీ, డెవలప్‌మెంట్ పేరుతో అదనపు ఛార్జీలు
- హాస్టల్, రవాణా ఫీజులతో విద్యార్థుల దోపిడీ
- మేనేజ్‌మెంట్ కోటాలో లక్షల రూపాయల డొనేషన్లు
- మెరిట్‌కు కాకుండా డబ్బుకే ప్రాధాన్యం అన్న విమర్శలు
- అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్

చదువు అనేది భవిష్యత్తుకు బాటలు వేసే వెలుగు కావాలి గానీ, ఒక కుటుంబం ఆర్థికంగా నలిగిపోయే చీకటి కాకూడదు. విద్యే అమృతం అన్న నానుడిని పక్కనబెట్టి, నేటి ఇంజినీరింగ్ విద్యావ్యవస్థ వ్యాపార సా-మ్రాజ్యంగా మారిపోవడం అత్యంత విచారకరం. 02



## తెలంగాణ ప్రజలకు బిగ్ అలర్ట్

### ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- సంగారెడ్డి నుంచి పంపిణీకి సీఎం రేవంత్ శ్రీకారం
- 119 నియోజకవర్గాల్లో ఏకకాలంలో రేషన్ కార్డుల పంపిణీ
- 1.05 కోట్ల కుటుంబాలకు కొత్త పీడీఎస్ కార్డులు
- పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులతో కొత్త విధానం 02

# 'పోలవరం - బనకచర్ల' ప్రతిపాదన రిజెక్ట్

## ఏపీ ప్రభుత్వానికి కేంద్రం ఝలక్

### రూ.81,900 కోట్ల ప్రాజెక్టుకు తొలి దశలోనే ఎదురుదెబ్బ

**200 టీఎంసీల నీటి తరలింపు లక్ష్యానికి బ్రేక్**

- ఏపీ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్ర పర్యావరణ శాఖ
- పోలవరం-బనకచర్లకు పర్యావరణ అనుమతులపై బ్రేక్
- ఈఏసీ నివేదికతో ప్రాజెక్టుకు కేంద్రం నిరాకరణ
- గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని అభ్యంతరం
- ప్రాజెక్టుపై తెలంగాణ సహా పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు
- అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- సీడబ్ల్యూసీ అనుమతుల తర్వాతే ప్రతిపాదనలు పంపాలని సూచన
- వరద జలాల లభ్యతపై సమగ్ర నివేదిక కోరిన కేంద్రం
- నీటి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని ఏపీకి ఆదేశం

03

**న్యూ ఢిల్లీ :**

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన (ప్రాజెక్టు) ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ చేసిన నివేదికలు, సిఫార్సుల ఆధారంగా ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక సమాధానం ద్వారా స్పష్టం చేశారు.

**ప్రాజెక్ట్ నిరాకరణకు కారణాలివే..**

అయితే, 1980 నాటి గోదావరి నదీ జలాల నివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు తాజాగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు డిజైన్...

### సీడబ్ల్యూసీ అనుమతులు మస్ట్..



తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆ మహనీయుడి సేవలను స్మరిస్తూ నివాళులర్పించారు.

## మరో 48 కాలేజీలపై హైడ్రా ఫిర్యాదు!

### మరో 176 కాలేజీలపై విచారణ



- ఒకే తరహాలో నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసినట్లు వెలుగులోకి
- హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీ ధ్రువపత్రాల సృష్టి
- ఇంటర్ బోర్డుకు ఫోర్జరీ పత్రాలు సమర్పించిన కాలేజీలు
- జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల సంతకాల ఫోర్జరీ బహిర్గతం 02



## తెలంగాణ సచివాలయంలో ఘనంగా బోనాలు

- ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన 03

## రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

**మా గురువు జయశంకర్ సార్.. మీ గురువు చంద్రబాబు..**

- చంద్రబాబుకు వంతపాడటమే సీఎం పని అని విమర్శ
- పాలమూరు, కన్నెపల్లి పంపులను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్న
- ప్రొఫెసర్ జయశంకర్ సేవలను గుర్తు చేసిన కేటీఆర్
- జై తెలంగాణ అనలేని సీఎం రాష్ట్రానికి దురదృష్టమని వ్యాఖ్య
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని పిలుపు 05




## ఏ రోజూ జై తెలంగాణ అనలేదు..



### తెలంగాణ ఉద్యమం నీళ్ల కోసమే

- 'జై తెలంగాణ' అనని వ్యక్తే నేడు సీఎం అంటూ విమర్శ
- జయశంకర్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి నివాళి
- మూడేళ్లలో ప్రాజెక్టులకు ఒక్క అనుమతి కూడా రాలేదని ఆరోపణ
- జీఆర్ఎంబీ అజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల రివ్యూపై అభ్యంతరం
- ప్రభుత్వానికి నీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి లేదన్న హరీశ్‌రావు
- జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ 03
- బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్న
- దేవాదుల ప్రాజెక్టును ఎందుకు వదులుకుంటున్నారని నిలదీత
- ఏపీతో లోపాయికారీ ఒప్పందం జరిగిందని ఆరోపణ



## ఇంతకీ ఆ బాలికకు ఏమైంది?

**కిడ్నాప్ చేశారా?.. కావాలనే వెళ్లిపోయిందా?..**

- 13 ఏళ్ల బాలిక కోసం ముమ్మర గాలింపు
- విద్యార్థిని ఆచూకీ కోసం పోలీసుల ప్రత్యేక దర్యాప్తు
- మధ్యప్రదేశ్ బంధువుల వద్దకు వెళ్లి ఉండొచ్చని అనుమానం
- ఎవరైనా ప్రలోభపెట్టి తీసుకెళ్లారా? అన్ని కోణాల్లో విచారణ 05
- జగిత్యాలలో మైనర్ విద్యార్థిని అదృశ్యం.. కలకలం
- యూనిఫాం, బ్యాగ్, పుస్తకాలు వదిలేసి అదృశ్యం

## సింగరేణి చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం..

### నైనీ గని నుంచి తెలంగాణకు చేరిన తొలి బొగ్గు రైలు



- సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం.. నైనీ బొగ్గు తెలంగాణకు చేరిక
- ఒడిశా నైనీ గని నుంచి తొలి బొగ్గు రైలు విజయవంతంగా రాక
- తెలంగాణ ఇంధన భద్రతలో చారిత్రాత్మక మైలురాయి
- సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు చేరిక
- 1,131 కిలోమీటర్లు ప్రయాణించిన తొలి బొగ్గు రైలు
- 59 వ్యాగన్లలో నాణ్యమైన బొగ్గు రవాణా
- నైనీ గని ప్రారంభంలో భట్టి విక్రమార్క కీలక పాత్ర 05

**రేవంత్ రెడ్డి చొరవతో నైనీ ప్రాజెక్టుకు ఊతం**



**1,131 కిలోమీటర్లు ప్రయాణించిన తొలి బొగ్గు రైలు**



## అగ్రవర్ణాలకు కవిత విజ్ఞప్తి..

### బీసీలకు 50% రిజర్వేషన్ ఇవ్వాలి

- 56%బీసీ జనాభాకు 42%రిజర్వేషన్ బిల్లు సరిపోదని విమర్శ
- రేవంత్, కిషన్‌రెడ్డిపై కవిత విమర్శలు
- బీసీలకు 50%రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానం 02
- పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్
- ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని తీర్మానం
- సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో కీలక తీర్మానాలు
- వనరులు అందరికీ సమానంగా అందాలని పిలుపు

**జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని తీర్మానం**

క్షత్రియుడైన గౌతమ బుద్ధుడు, సామూమహారాజు స్ఫూర్తితో అగ్రవర్ణ మిత్రులు సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు. గౌతమబుద్ధుడు, సాహూమహారాజు ఆదర్శంతో సామాజిక న్యాయం కోసం టీఆర్ఎస్ పాటుపడుతుందన్నారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో దొరలనందరినీ గడీల నుంచి తరిమికట్టడంతో ఆర్థికంగా ఉన్న అసమానతలను తొలగించే ఒక అడుగు పడిందన్నారు.

# తెలంగాణ ప్రజలకు బిగ్ అలర్ట్

## ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. సంగారెడ్డిలో సీఎం పంపిణీ ప్రక్రియను ప్రారంభించిన వెంటనే, రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు కార్డులను నేరుగా అందజేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు లామినేటెడ్ (పీవీసీ) రూపంలో రూపొందించిన నూతన రేషన్ కార్డులను అందించనున్నారు. వాటర్‌ప్రూఫ్, క్రెడిట్ కార్డు పరిమాణంలో అత్యంత ఆకర్షణీయంగా ఉండే ఈ 'స్మార్ట్' కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధునిక భద్రతా ప్రమాణాలను పొందుపరిచారు.

**జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు..**

అయితే, రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు ప్రభుత్వం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా తుది లబ్ధిదారుల జాబితాల ధృవీకరణను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అలాగే రేషన్ కార్డుల ముద్రణ స్థాయి నుండి జిల్లాలకు చేరే వరకు సురక్షితమైన రవాణా నిర్వహణపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. పంపిణీ కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగేందుకు జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పంపిణీ ప్రక్రియ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయంతో లక్షలాది కుటుంబాలకు నూతన రేషన్ కార్డుల కల నెరవేరనుంది.

# అగ్రవర్ణాలకు కవిత విజ్ఞప్తి..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సమాజంలో వనరులు అందరికీ సమానంగా అందాలనేదే మనందరి ఆలోచన కావాలని తెలంగాణ రక్షణ సేకన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సామాజిక న్యాయం అనగానే అగ్రవర్ణాలకు వ్యతిరేకం అనుకుంటారు.. కానీ నరులు సమానంగా పంచుకోవాలన్నదే సామాజిక న్యాయం అన్నారు. అగ్రవర్ణ మిత్రులు ఒక్కసారి పునరాలోచించాలని చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. వంద మందికి వంద రొట్టెలు ఉంటే తలా ఒక్కటి తినటం న్యాయం, ధర్మం. కానీ పది మంది బలవంతులు 90 రొట్టెలు తింటుంటే, 90 మంది బలహీనులు పది రొట్టెలు తింటున్నారని ఇది న్యాయమా? ధర్మమా అని ప్రశ్నించారు. భారత దేశంలో ఎప్పుడు ఏ పరివర్తన వచ్చినా అగ్రవర్ణాల్లోని ప్రజాస్వామ్యవాదులు కలిసి వచ్చి ఆ మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ఇవాళ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో కవిత మాట్లాడారు.

**అందుకే తెలంగాణలో కుల వివక్ష:**

క్షత్రియుడైన గౌతమ బుద్ధుడు, సాహూమహారాజు స్ఫూర్తితో అగ్రవర్ణ మిత్రులు సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు. గౌతమబుద్ధుడు, సాహూమహారాజు ఆదర్శంతో సామాజిక న్యాయం కోసం టీఆర్ఎస్ పాటుపడుతుందన్నారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో దొరలనందరినీ గడీల నుంచి తరిమికట్టడంతో ఆర్థికంగా ఉన్న అసమానతలను తొలగించే ఒక అడుగు పడిందన్నారు. కానీ సామాజికంగా, కుల వివక్షపై జరగాల్సిన పోరాటాలు అనుకున్నంత స్థాయిలో జరగలేదన్నారు. అందుకే తెలంగాణలో ఇప్పటికీ కుల వివక్ష, సామాజిక అన్యాయం జరుగుతోందన్నారు. ఈ న్యాయం చేసేందుకు టీఆర్ఎస్ సంకల్పం తీసుకుంటోందన్నారు.

**నాకేం సంబంధం అని మాట్లాడుతున్నారు:**

సామాజిక న్యాయం పై కవితకు ఏం సంబంధమని కొంత మంది మాట్లాడుతారు. అలాంటి వారికి చెబుతున్నా చెవురు విప్పి వినాలన్నారు. నేను ఓ అగ్రవర్ణంలో పుట్టాను ఇది నా చేతుల్లో లేని పని కానీ నేను ఎలా జీవించాలి ఎవరికి కోసం పని చేయాలో మాత్రం నా చేతులో ఉందన్నారు. అందుకే అణగారిన వర్గాల కోసం, కనీసం వార్డు మెంబర్ కూడా కాలేకపోయిన కులాలతో కలిసి పని చేస్తూ వారికి సాధికారత తెచ్చే వరకు నా జీవితం అంకీతం చేస్తున్నానని చెప్పారు. విదేశాలకు వెళ్తున్న మన వారిని అక్కడి వారు వివక్ష చూపుతుంటే అది రేసిజం అంటున్నాం. మరి మన పక్కనే ఉన్న వివక్షను వివక్షను తుడిచివేయొద్దా అని అన్నారు. స్వతంత్ర్యం వచ్చిన నాడే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చారో ఆనాడే బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఉంటే ఇప్పుడు మన దేశం అమెరికాతో పోటీపడేవారిమన్నారు. మనలో పరివర్తన రావాలన్నారు. బ్యాకులాగ్ ఉన్నా ప్రతి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో 56 శాతం బీసీ జనాభా ఉంటే కాంగ్రెస్ పార్టీ 42 శాతం బిల్లు పెట్టిందని విమర్శించారు. ఈ బిల్లును రాష్ట్ర పతి వద్ద పెండింగ్ పెట్టి రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మాత్రం ప్రేమలేఖలు రాసుకుంటున్నారని విమర్శించారు.

**జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని తీర్మానం:**

ఈ సభలో కవిత పలు తీర్మానాలు చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్, పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని, జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్రం లేఖ రాయాలని కోరుతూ తీర్మానం చేశారు.

# మరో 48 కాలేజీలపై హైడ్రా ఫిర్యాదు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర్ ఎన్‌ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్‌ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# అదనపు వసూళ్ల పర్వం!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చదువు అనేది భవిష్యత్తుకు బాటలు వేసే వెలుగు కావాలి గానీ, ఒక కుటుంబం ఆర్థికంగా నలిగిపోయే చీకటి కాకూడదు. విద్యే అమృతం అన్న నానుడిని పక్కనబెట్టి, నేటి ఇంజినీరింగ్ విద్యావ్యవస్థ వ్యాపార సామ్రాజ్యంగా మారిపోవడం అత్యంత విచారకరం. మధ్యతరగతి, పేద తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్ప ఇంజినీర్లుగా చూడాలన్న కలలతో తమ చెమటను, రక్తాన్ని ధారపోస్తుంటే, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం అక్షరాలను వేలం పాటగా మారుస్తూ విచ్చలవిడిగా నిలువుదోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వం అనుమతించిన ఫీజుల నిబంధనలను బొందపెట్టి, చట్టాల పగ్గాలను తెంచుకుని, ఏటా 20% నుంచి 30% అదనంగా గుంజుతున్నాయి. అయినా ఈ కార్పొరేట్ భకాసురుల ధనదాహం తీరడం లేదు.

**పరిమితి లేని దోపిడీ..**

విద్యార్థి భవిష్యత్తును సరిదిద్దాల్సిన కళాశాలలు.. లైబ్రరీ ఫీజు, ల్యాబ్ ఫీజు, బిల్డింగ్ ఫండ్, డెవలప్‌మెంట్ ఛార్జీలు, చివరికి ఉద్యోగ సాధన పేరుతో ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ఫీజులంటూ రకరకాల రంగుల పేర్లతో వేలకు వేలు అదనంగా లాగుతున్నాయి. రవాణా, హాస్టల్ వసతుల పేరుతో పరిమితి లేని దోపిడీ సాగుతోంది. మెరిట్ ఉన్న విద్యార్థులను పక్కనబెట్టి, ప్రవేశ పరీక్షలు జరగకముందే అడ్మిషన్ల పేరుతో ప్రలోభపెడుతూ, మేనేజ్‌మెంట్ కోటా కింద లక్షల రూపాయల డొనేషన్లు గుంజుతున్న తీరు విద్యా వ్యవస్థకే మచ్చగా మారింది. ఇంత భారీగా ఫీజులు దండుకుంటున్నా, తీరా కళాశాలల్లో చూస్తే అరకొర జీతాలకే నడిచే అనుభవరాహిత్య అధ్యాపకులు, అధునాతన ల్యాబ్ పరికరాలు లేని గదులు, నకిలీ సర్టిఫికేషన్లు, ఉనికిలోనే లేని కంపెనీల పేరుతో నామమాత్రపు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తును త్రిశంకు స్వర్గంలో పడేస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం శున్యం..**

ఈ కార్పొరేట్ అక్రమాలపై, నిస్సహాయ తల్లిదండ్రుల ఆవేదనపై హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి నాయకుడు దేవరాల రాకేష్ యాదవ్ మరోసారి సమరశంఖం పూరించారు. "అక్షరాన్ని అమ్ముకునే వ్యాపారులారా... విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు!" అంటూ గళమెత్తారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో పాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ అక్రమాలను ఆధారాలతో సహా తీసుకెళ్లారు. పలు ఇంజినీరింగ్ కళాశాలలు చట్టవిరుద్ధంగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయని నిలదీశారు. దీనిపై స్పందించిన ఎన్హెచ్ఆర్సి కేసుకు ఆదేశించడం, ఏఐసీటీఈ సదరు కళాశాలలకు నోటీసులు జారీ చేయడం, అలాగే సేకరించిన అదనపు ఫీజులను వెంటనే విద్యార్థులకు తిరిగి చెల్లించాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ కావడం దేవరాల రాకేష్ పోరాటానికి దక్కిన తొలి విజయం. కానీ.. ఈ పోరాటం ఇంకా ఫలించలేదు. ఎన్ని ఫిర్యాదులు చేసినా.. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. టీజీఈఏపీసెట్--2026 ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో మొత్తం 94,156 సీట్లు అందుబాటులో ఉండగా, 75,054 సీట్లు భర్తీ అయ్యాయి. ఆగస్టు 7 చివరి తేదీ లోపు కళాశాలలను టు పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజీలో రిపోర్ట్ చేయడానికి ఆగస్టు 7 చివరి తేదీగా అధికారులు ఖరారు చేశారు. సమయం తక్కువగా ఉంది. ఇదే అదునుగా చూసుకుని కళాశాలలు మరోసారి రెచ్చిపోతున్నాయని దేవరాల రాకేష్ తెలిపారు. మళ్లీ అధిక ఫీజుల పర్వం మొదలైందని మరోసారి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**విద్య వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత!**

"జ్ఞానం పంచాల్సిన చోట ధనదాహం ఏలితే... విద్యార్థి మనసులో కసి కాదు, నిరాశే మిగులుతుంది." చదువుకునే వయసులో ప్రతిభకు ప్రాధాన్యం దక్కక, ఆర్థిక భారం తట్టుకోలేక ఎందరో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి, కేవలం నోటీసులతో సరిపెట్టకుండా, అక్రమ వసూళ్లకు పాల్పడే ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల గుర్తింపును రద్దు చేసే స్థాయి కఠిన చర్యలు చేపట్టాలి. విద్య అనేది వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత! ఆ బాధ్యతను కాపాడటానికి దేవరాల రాకేష్ లాంటి నాయకులు చేస్తున్న ఈ పోరాటం, ప్రైవేట్ యాజమాన్యాల కళ్లు తెరిపించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు నిజమైన న్యాయం చేకూర్చే వరకు సాగాల్సిందే.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు




**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పట్టణంలోని ఎన్జీ కళాశాలలో గురువారం ప్రొపెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ మొదటి దశలో భావజాల వ్యాప్తిని రెండవ దశలో ఉద్యమ ప్రచార వ్యాప్తిని, మూడవ దశలో రాజకీయ ప్రక్రియను ఎన్నుకొని తెలంగాణను సాధించడంలో సిద్ధాంతకర్తగా, జాతిపితగా మనం గుర్తించుకోగలిగిన గొప్ప వ్యక్తిగా గుర్తుండిపోయారని,జయశంకర్ సార్ లో మూడు దశలు ఉన్నాయి, స్టూడెంట్ గా ఉన్నప్పుడు తెలంగాణ యాక్ట్ విస్ట్ గా, ఎంప్లాయ్ గా ఉన్నప్పుడు వృత్తి ,ఉద్యోగ సమస్యలతో పాటు అంతర్లీనంగా తెలంగాణ సమస్య ఉండే, రిటైర్డ్ అయ్యాక సింగిల్ పాయింట్ ప్రోగ్రాం తెలంగాణ మాత్రమే లక్ష్యంగా ఉందని 2011 జూన్ 21న తెలంగాణ స్వతంత్ర రాష్ట్రంగా కనులు తెరవకముందే, జయశంకర్ సార్ కనుముయడం తెలంగాణ చేసుకున్న దురదృష్టం. తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ తత్వవేత్త ,తెలంగాణ జాతిపిత గా ఎవరు ఎలా పిలిచిన ఆయన మాత్రం అందరికీ జయశంకర్ సార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నర్సింగ్ కోటయ్య ఎం వెంకటరెడ్డి, కె .శివ రాణి, డాక్టర్ ఆదే మల్లేశం,ఎం. సావిత్రి, హాబీబ్, దినేష్ ,అంకుష్, హబీబ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ కోసం జీవితాన్నే ధారపోషిన "మహర్షి ప్రొఫెసర్ జయశంకర్"...

**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధార పోసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకొని, గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంబంధింత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**చింతకాని,ఫ్లాష్ ఇండియా :** చింతకాని, ముదిగొండ మండలాల ప్రజల సౌకర్యార్థం ఖమ్మం--విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సుకు చింతకాని మండల పరిధిలోని మత్కేపల్లి ఎక్స్ రోడ్ వద్ద అధికారికంగా నిలుపుదల(స్టాప్) మంజూరైంది. మండల ప్రజల విజ్ఞప్తి పరిగణనలోకి తీసుకున్న రవాణా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై ఖమ్మం నుంచి ప్రతిరోజూ విజయవాడకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ బస్సు మత్కేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆగనుంది. దీంతో ప్రధానంగా చింతకాని మండల కేంద్రానికి రాకపోకలు సాగించే అధికారులు మరియు ప్రయాణికులకు ప్రయాణ సమయం చాలా వరకు తగ్గే అవకాశముంది. అంతే కాకుండా ముదిగొండ మండలాల ప్రయాణికులు అక్కడి నుంచే బస్సు ఎక్కి విజయవాడకు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు అవకాశం లభించనుంది. ఈ కొత్త నిలుపుదలతో రెండు మండలాల ప్రజలకు విజయవాడకు వెళ్లేందుకు సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణ సౌలభ్యం మరింత పెరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సౌకర్యాన్ని కల్పించిన ఖమ్మం డిపో మేనేజర్‌కు చింతకాని, ముదిగొండ మండలాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి ఘన నివాళులు

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి ఘన నివాళులు జనగామ మున్సిపల్ కార్యాలయంలో గౌరవ చైర్‌పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొని ఆచార్య జయశంకర్ గారి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి, త్యాగం మరియు తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన విధానాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. ఆచార్య జయశంకర్ గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని చైర్‌పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ వైస్ చైర్మన్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# 'పోలవరం - బనకచర్ల' ప్రతిపాదన రిజెక్ట్

## ఏపీ ప్రభుత్వానికి కేంద్రం ఝలక్

**న్యూ ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన (ప్రాజెక్టు) ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ చేసిన నివేదికలు, సిఫార్సుల ఆధారంగా ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక సమాధానం ద్వారా స్పష్టం చేశారు.

**ప్రాజెక్ట్ నిరాకరణకు కారణాలివే..**

అయితే, 1980 నాటి గోదావరి నదీ జలాల నివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు తాజాగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు డిజైన్, నీటి కేటాయింపులు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయంటూ కేంద్రానికి పలు ఫిర్యాదులు, అభ్యంతరాలొచ్చాయి. అదేవిధంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో అంతర్రాష్ట్ర వివాదాలు తలెత్తే అవకాశం ఉందని, ఎగువన ఉన్న తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని వచ్చిన నివేదికలను EAC పరిశీలించింది.

**సీడబ్ల్యూసీ అనుమతులు మస్ట్..**

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు ముందుగా కేంద్ర జల సంఘం ద్వారా వరద నీటి లభ్యతపై సమగ్ర అంచనా వేయించుకుని, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకున్న తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేస్తూ కేంద్రం ఏపీకి ఈ దరఖాస్తును తిప్పి పంపినట్లుగా తెలుస్తోంది. అయితే, రాయలసీమలోని కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించడంతో పాటు ప్రకాశం జిల్లా బేసిన్‌ను స్థిరీకరించేందుకు ఏపీ ప్రభుత్వం రూ. 81,900 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు ఏపీ సర్కార్ రూపకల్పన చేసింది. గోదావరిలో లభ్యమయ్యే మిగులు జలాల నుంచి ప్రతిరోజూ 2 టీఎంసీల చొప్పున 100 రోజుల్లో మొత్తం 200 టీఎంసీల నీటిని కృష్ణా నది మీదుగా పెన్నా బేసిన్‌లోని బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు మళ్లించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీరు అందించవచ్చని ప్రభుత్వం భావించింది. కానీ, కేంద్రం ఈ ప్రతిపాదనను ప్రాథమిక దశలోనే తిరస్కరించడం రాష్ట్ర ప్రభుత్వానికి మింగుడుపడని అంశంగా మారింది.

# సీఎంకు రామచందర్ రావు లేఖ

## ధాన్యం మిల్లింగ్‌లో రూ.500 కోట్ల అక్రమాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సుమారు రూ. 500 కోట్ల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం అక్రమాలు జరిగినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. 2023 నుంచి మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం-వచ్చిన బియ్యం మధ్య తేడా ఉందన్నారు. కస్టమ్ మిల్లింగ్ ధాన్యం ప్రభుత్వానికి రాలేదని ఆరోపణలు వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఇవాళ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం జరిగిందని సమాచారం ఉందని అందువల్ల దీనిపై పారదర్శక, వేగవంతమైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు

**సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేయండి:**

ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారాన్ని కాపాడే అత్యంత కీలక వ్యవస్థ అని అంతేకాకుండా ఇది ప్రజా పంపిణీ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం అని తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ ధాన్యం మళ్లింపు వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ ఆర్థిక నష్టం కలగడమే కాకుండా, పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన ధాన్యం కొనుగోలు వ్యవస్థపై ఆధారపడే రైతుల విశ్వాసం కూడా దెబ్బతింటుందన్నారు. ఈ అంశంలో ఎవరైనా దోషులుగా తేలితే వారు ఎంతటివారైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియల్లో పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసే విధంగా సమగ్ర వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రామచందర్ రావు సీఎంను కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలి...

## గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని దామరచర్ల,మిర్యాలగూడ, వేములపల్లి మండలాలలో గురువారం నిర్వహించిన "గ్రామపంచాయతీ అభివృద్ధి మరియు సామర్థ్య వృద్ధి"కార్యక్రమాలపై జరిగిన మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశాలలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీలు గ్రామాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలవాలంటే అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ,పచ్చదనం పెంపు, ప్రజలకు మెరుగైన సేవలందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు గ్రామపంచాయతీల పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,సంబంధిత మండలాల ప్రజాప్రతినిధులు,మండల అధికారులు, సర్పంచులు,వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సచివాలయంలో ఘనంగా బోనాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) సంజయ్ జాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, తెలంగాణ ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ వేషధారణలో కళాకారుల ప్రదర్శనలు బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సచివాలయానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణలో శాంతి, సౌభాగ్యం, సుభిక్షం నెలకొని రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# భూ భారతి పోర్టల్ పై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలో భూ భారతి ఆపరేటర్లుగా ఎంపికైన జూనియర్ అసిస్టెంట్లు భూ భారతి పోర్టల్‌పై నిర్వహిస్తున్న శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాములుతో కలిసి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి పోర్టల్ వినియోగం, విధివిధానాలపై జూనియర్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ ద్వారా భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సేవల వేగం మరింత మెరుగుపడుతాయని తెలిపారు. శిక్షణలో బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకుని, పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరిష్కరించి, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. భూ భారతి పోర్టల్ నిర్వహణలో ఖచ్చితత్వం, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, రెవెన్యూ సేవల్లో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, రెవెన్యూ శాఖ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, వివిధ మండలాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఏ రోజూ జై తెలంగాణ అనలేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తాలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజు కూడా జై తెలంగాణ అనలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా, ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందో స్పష్టం చేయాలన్నారు. సమ్మక్క సారక్క (దేవాదుల) ప్రాజెక్టుకు 47 టీఎంసీల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చిన తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం దానిని ఎందుకు వదులుకుంటోందో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా వరంగల్, నల్గొండ జిల్లాలకు నీరందించే ఈ ప్రాజెక్టును వదులుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఫ్లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

# అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి




**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో మహిళల భద్రత, సంక్షేమం, సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల భద్రత, రక్షణ, సంక్షేమం, మహిళా సాధికారతకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు సమన్వయంతో అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, గృహ హింస, లైంగిక దాడులు, సైబర్ నేరాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించడంతో పాటు వారికి చట్టపరమైన రక్షణ, కౌన్సెలింగ్, వైద్య సేవలు, పునరావాసం వంటి సేవలను ఒకే వేదికపై అందించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మహిళల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత సున్నితంగా, వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రం, సఖి కేంద్రం, జిల్లా న్యాయ సేవల సంస్థల సేవలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మహిళలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలన్నారు. "మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొంటూ, కుటుంబం, విద్యాసంస్థలు, సమాజంలో మహిళల పట్ల గౌరవభావం పెంపొందేలా నిరంతర అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తూ, పరిష్కరించాలన్నారు. అనంతరం పలు బాధితుల సమస్యలను విని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీడబ్ల్యూఓ బెన్షాలోమ్, మహిళా కమిషన్ సభ్యులు కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ్ రెడ్డి, ఎన్. రాధాబాయి, సదా లక్ష్మీ, కార్యదర్శి బి. పద్మజా రమణ, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, అదనపు డీసీపీ బాలస్వామి, వెంకటరమణ, ఏపీడీ నూరుద్దీన్, జిల్లా న్యాయ సేవల సంస్థ, షీ టీమ్స్, భరోసా కేంద్రం, సఖి కేంద్రం, పోలీసు శాఖ, షీ టీమ్స్, భరోసా కేంద్రం, తదితర అధికారులు పాల్గొన్నారు.

# దమ్ముంటే నా వీడియోలు బయట పెట్టాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్షుద్ర పూజల విషయంలో హరీశ్ వివరణ ఇవ్వాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మరోసారి డిమాండ్ చేశారు. మాకు మూఢనమ్మకాలు లేవు కానీ హరీశ్ ఎందుకు మార్చి 2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గలో పూజలు చేశాడో చెప్పాలన్నారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన. నేను హరీశ్ రావును కించపరచలేదని, ఆయనపై తప్పుడు ప్రచారం చేయలేదన్నారు. కానీ హరీశ్ రావు వెళ్లిన గుడులు క్షుద్రపూజలకు ఫేమస్ అని అందువల్ల అతడు ఆ గుడులకు ఎందుకు వెళ్ళాడో చెప్పాలన్నారు. ఈ రాష్ట్రానికి ఎవరు శనో, ఎవరు దరిద్రమో ప్రజలు ఎన్నికల్లో తేల్చారన్నారు. హరీశ్ రావు లీగల్ నోటీసులకు భయపడమని ఏమైనా ఉంటే న్యాయ స్థానంలో కొట్లాడుతామన్నారు.

**కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం సీఎంకు లేదు:**

కాంగ్రెస్ త్యాగాల గురించి తెలుసుకోవాలని, విమర్శలు చేయడానికి ప్రతిపక్షాలు అవకాశముందన్నారు. ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంలు కో ఆర్డినేషన్ కమిటీలో చర్చిస్తే బాగుంటుందని అనుకున్నామని అందరం చర్చిస్తే మంచి నిర్ణయాలు తీసుకోగలమని అనుకున్నామన్నారు. కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదన్నారు. మేం ముఖ్యమంత్రిని గౌరవిస్తామని పార్టీ, ప్రభుత్వం వేరు వేరు కాదని చెప్పారు. కో ఆర్డినేషన్ కమిటీలో కీలక చర్చ జరిగింది అందరం ఓపెన్ గానే మాట్లాడుకున్నామని చెప్పారు. కో ఆర్డినేషన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం. మీరు ఫోటోలో చూస్తే వంశీ మధ్యలో కూర్చున్నట్టు అనిపిస్తోంది ప్రోటోకాల్ ప్రకారం మీనాక్షీ నటరాజన్ సమీక్ష నిర్వహించారన్నారు. టేబుల్ ఓవెల్ షేప్‌లో ఉంది కాబట్టి అందరూ పొరబడుతున్నారన్నారు.

**దమ్ముంటే నా వీడియోలు బయట పెట్టాలి:**

నా ఆడియోలు వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని దమ్ముంటే నా ఆడియోలు, వీడియోలు బయట పెట్టాలన్నారు. సీఎంకు, నాకు మంచి సఖ్యత ఉందని దొంగ చాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్‌లో లేదన్నాపు, ఏమున్నా మేం మొహంపైనే మాట్లాడుకుంటామని బయట జరుగుతున్న విషయాలను చర్చించుకుంటామన్నారు. రేవంత్ రెడ్డి మా కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని నాకు, సీఎంకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదన్నారు. సీఎం నేను రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని నిన్న కూడా సీఎం తో ఫోన్ మాట్లాడానని చెప్పారు. బీజేపీ ధర్మపురి అర్వింద్ మాటలు నీటి మూటలని నా ముందు అర్వింద్, సంజయ్ పిల్లలు అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి కూడా హైట్ తక్కువే దేశాన్ని ఏలలేదా? అని ప్రశ్నించారు.

# నా ప్రేమకు అడ్డుపడుతున్నాడు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తాను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు తన తండ్రి అడ్డుపడుతున్నాడని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై ఆయన కుమారుడు సంతోశ్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తన తండ్రి వల్ల తనకు తనకు కాబోయే భార్య కుటుంబానికి ప్రాణ హాని ఉందని మాకు ఏం జరిగినా అందుకు తన తండ్రి ప్రకాశ్ గౌడ్ కారణం అని ఆరోపించారు. తాను మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు రూపారెడ్డి కూతుర్ని ప్రేమించానని ఆమెను పెళ్లి చేసుకుంటానంటే పెద్దలుగా మా ఇంట్లో వారు అంగీకరించలేదని చెప్పారు. అయితే నా ఇష్టప్రకారం ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటానంటే చేసుకోవచ్చని చెప్పడంతో నేను గత నెలలో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నానని చెప్పారు. అప్పటి నుంచి రూపారెడ్డి ఇంట్లోనే ఉంటున్నానని చెప్పాడు.

**అంతం చేయాలని ప్లాన్:**

ఈ క్రమంలో ఎలాగైనా తనను అంతం చేయాలని పథకం ప్రకారం 40 మందితో తన తన అత్త ఇంటిపై దాడి చేయించారని ఆరోపించారు. ఈ దాడి ఘటన వెనుక తన తండ్రి ఉన్నారని సంతోష్ గౌడ్ ఆరోపించారు. ఇంటిపై దాడి జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చినా ఫిర్యాదును పోలీసులు సరిగా స్వీకరించలేదని ఆరోపించాడు. నార్సింగ్ పోలీసులు రాజకీయ ప్రభావంతో తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించాడు. మీడియా ముందుకు రావడంతో తమ ప్రాణాలకు ముప్పు ఉందని సంతోష్ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే కొడుకు ప్రేమ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.


సంపాదకీయం

# చరిత్రను మార్చేది ప్రజల చైతన్యమే





చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. సమాజంలో మార్పులు ఎప్పుడూ ఒకే విధంగా రావు. కొన్ని మార్పులు సుదీర్ఘకాలం పాటు సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణాలు, క్రమశిక్షణతో సాగిన ఉద్యమాల ఫలితంగా వస్తే, మరికొన్ని ఆకస్మికంగా ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి ఒక్కసారిగా పేలిపోవడం వల్ల చోటుచేసుకుంటాయి. ఈ రెండు రూపాలను పరస్పర విరుద్ధాలుగా చూడటం చరిత్రను పూర్తిగా అర్థం చేసుకోకపోవడమే అవుతుంది. జర్మన్ తత్వవేత్త హెగెల్ ఒక సందర్భంలో చెప్పినట్లు, "చరిత్ర మనకు నేర్పే గొప్ప పాఠం ఏమిటంటే... చరిత్ర నుంచి మనం ఏమీ నేర్చుకోకపోవడమే." ఈ వ్యాఖ్య నేటి సామాజిక, రాజకీయ పరిణామాలకు కూడా ఎంతో దగ్గరగా ఉంటుంది.ప్రజా ఉద్యమాలంటే చాలామందికి రాజకీయ పార్టీలు, జెండాలు, నాయకులు, సమావేశాలు, దీర్ఘకాలిక కార్యాచరణలు గుర్తుకు వస్తాయి. నిజానికి అలాంటి ఉద్యమాలే ఎన్నో చారిత్రక విజయాలకు కారణమయ్యాయి. కార్మిక ఉద్యమాలు, రైతు పోరాటాలు, స్వాతంత్ర్య సమరం, సామాజిక న్యాయ ఉద్యమాలు అన్నీ కూడా క్రమబద్ధమైన నాయకత్వంతో ముందుకు సాగాయి. కానీ అంతే నిజం ఏమిటంటే, చరిత్రలో అనేక సందర్భాల్లో ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా ప్రజల్లో పేరుకుపోయిన ఆవేదన ఒక్కసారిగా ఉద్యమ రూపం దాల్చింది. అలాంటి ఉద్యమాలు కూడా సమాజంపై గాఢమైన ప్రభావాన్ని చూపాయి.ఇటీవల దేశవ్యాప్తంగా పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలలో అవకతవకలు, యువత భవిష్యత్తుపై పెరుగుతున్న అనిశ్చితి లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. సంవత్సరాల పాటు కష్టపడి పరీక్షలకు సిద్ధమైన అభ్యర్థుల ఆశలు ఒక్క క్షణంలో కూలిపోయాయి. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో అసహనం పెరిగింది. ఇదే నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో మొదలైన ప్రతీకాత్మక నిరసన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది సంప్రదాయ రాజకీయ ఉద్యమం కాదు. దీనికి కేంద్రీకృత నాయకత్వం లేదు. గ్రామస్థాయి కమిటీలు లేవు. సభ్యత్వ నమోదు లేదు. అయినప్పటికీ లక్షలాది మంది యువత ఒకే భావోద్వేగంతో స్పందించడం విశేషం.ఈ ఉద్యమం విజయాన్ని కేవలం సోషల్ మీడియా ప్రభావంగా చూడటం సరైన విశ్లేషణ కాదు. సోషల్ మీడియా కేవలం వేదిక మాత్రమే. అసలు కారణం ప్రజల్లో ఇప్పటికే పేరుకుపోయిన అసంతృప్తి. సమాజంలో బాధ లేకుంటే ఒక హ్యాష్‌ట్యాగ్‌తో దేశవ్యాప్త ఉద్యమం సాధ్యం కాదు. ఒక వ్యంగ్య వ్యాఖ్య మాత్రమే లక్షలాది మందిని వీధుల్లోకి తీసుకురాదు. ఆ వ్యాఖ్య ప్రజల మనసుల్లో ఉన్న భావాలకు ప్రతీకగా మారినప్పుడు మాత్రమే అది ఉద్యమంగా పరిణమిస్తుంది.అందుకే ఆకస్మిక ఉద్యమాలను కొందరు తక్కువ అంచనా వేయడం కూడా తప్పే. అలాగే అవే సమాజ మార్పుకు ఏకైక మార్గమని భావించడం కూడా అంతే ప్రమాదకరం. ఎందుకంటే ఆకస్మిక ఉద్యమాలు సమస్యను వెలుగులోకి తీసుకువస్తాయి. కానీ ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి సంస్థాగత కృషి, విధాన మార్పులు, చట్టపరమైన పోరాటం, ప్రజా చైతన్యం అవసరం. అక్కడే ప్రణాళికాబద్ధమైన ఉద్యమాల పాత్ర ప్రారంభమవుతుంది.ప్రజా ఉద్యమాల చరిత్రను పరిశీలిస్తే ఈ రెండు రూపాలు ఎప్పుడూ పరస్పర పూరకంగానే పనిచేశాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా ఇదే కనిపించింది. ఒకవైపు సంఘటిత రాజకీయ నాయకత్వం దేశాన్ని ముందుకు నడిపితే, మరోవైపు జలియన్‌వాలాబాగ్ వంటి సంఘటనలు ప్రజల్లో ఆకస్మిక ఆగ్రహాన్ని రగిలించాయి. రైతు ఉద్యమాలు, కార్మిక సమ్మెలు, విద్యార్థి పోరాటాలు కూడా ఇదే నమూనాను అనుసరించాయి. ప్రజల్లో ఆవేదన లేకుంటే ఉద్యమాలకు బలం ఉండదు. నాయకత్వం లేకుంటే ఆ ఆవేదన దిశ కోల్పోతుంది.నేడు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న అనేక సామాజిక ఉద్యమాలు కూడా ఇదే వాస్తవాన్ని నిరూపిస్తున్నాయి. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, అవకాశాల కొరత, పాలనా వ్యవస్థలపై అవిశ్వాసం ఇవన్నీ ప్రజల్లో అంతర్గత అసంతృప్తిని పెంచుతున్నాయి. ఒక చిన్న సంఘటన ఆ అసంతృప్తికి రూపం ఇస్తుంది. బయటికి కనిపించేది ఒక్క ఉద్యమమే అయినా, దాని వెనుక సంవత్సరాల సామాజిక వాస్తవం దాగి ఉంటుంది."కాక్రోచ్ జనతా పార్టీ" ఉద్యమాన్ని కూడా ఇదే కోణంలో చూడాలి. అది ఎవరో ఒక నాయకుడు నిర్మించిన ఉద్యమం కాదు. ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన కార్యక్రమం కాదు. యువత ఎదుర్కొంటున్న అన్యాయం, అవకాశాల కొరత, పరీక్షలపై నమ్మకం దెబ్బతినడం వంటి సమస్యల సమాహారమే ఆ ఉద్యమానికి ప్రాణం పోసింది. అందుకే ఈ ఉద్యమం విజయాన్ని ఒక వ్యక్తికి లేదా ఒక సోషల్ మీడియా ప్రచారానికి మాత్రమే ఆపాదించడం సరైనది కాదు. అది సమాజంలోని విస్తృత అసంతృప్తికి ప్రతిబింబం.అయితే ఇక్కడ మరో అంశాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఆకస్మిక ఉద్యమాలు భావోద్వేగాన్ని రగిలించగలవు. కానీ శాశ్వత మార్పు కోసం భావోద్వేగం ఒక్కటే సరిపోదు. ఆ శక్తిని విధాన మార్పుల దిశగా మళ్లించే బాధ్యత సంఘటిత ప్రజా ఉద్యమాలదే. ప్రజా సమస్యలను కేవలం వైరల్ పోస్టుల వరకు పరిమితం చేస్తే సమాజం ముందుకు సాగదు. అలాగే కేవలం సిద్ధాంతాల పేరుతో ప్రజల తక్షణ సమస్యలను విస్మరించినా ఉద్యమాలు ప్రజల నుంచి దూరమవుతాయి.ఇక్కడే మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఆకస్మిక ఉద్యమాన్ని "దిశలేని ఆవేశం"గా కొట్టిపారేయడం ఎంత తప్పో, ప్రతి సంఘటిత ఉద్యమాన్ని "పాత రాజకీయాల అవశేషం"గా చూడడం కూడా అంతే తప్పు. సమాజంలో మార్పు రావాలంటే ఈ రెండింటి మధ్య సమన్వయం అవసరం. ప్రజల్లో పుడుతున్న అసంతృప్తిని అర్థం చేసుకుని, దానికి సరైన రాజకీయ, సామాజిక దిశ చూపించగలిగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.భారతదేశం వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో యువత ఆవేదనను నిర్లక్ష్యం చేయడం పాలకులకు ఎప్పుడూ మంచిది కాదు. ఉద్యోగాలు, విద్య, పారదర్శక నియామకాలు, సమాన అవకాశాలు ఇవి కేవలం ఎన్నికల హామీలు కావు. ఇవి రాజ్యాంగబద్ధమైన సామాజిక బాధ్యతలు. ఈ బాధ్యతలు విస్మరించబడినప్పుడు ప్రజా అసంతృప్తి కొత్త కొత్త రూపాల్లో బయటపడుతుంది. ఆ రూపం కొన్నిసార్లు ఒక పెద్ద ఉద్యమంగా, మరికొన్నిసార్లు ఒక ప్రతీకాత్మక నిరసనగా కనిపించవచ్చు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యమాలు శత్రువులు కావు. అవి పాలనా వ్యవస్థకు హెచ్చరికలు. సమాజంలో ఎక్కడ లోపం ఉందో చూపించే అద్దాలు. వాటిని అణచివేయడం కంటే వాటి వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవడం ప్రభుత్వాల బాధ్యత. అదే ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక.చివరికి ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. చరిత్రను మార్చేది ఒక వ్యక్తి కాదు. ఒక పార్టీ కాదు. ఒక సిద్ధాంతం మాత్రమే కూడా కాదు. ప్రజల్లో పేరుకుపోయిన చైతన్యం, ఆ చైతన్యానికి దిశనిచ్చే సంఘటిత కృషి ఈ రెండింటి కలయికే చరిత్రను ముందుకు నడిపిస్తుంది. అందుకే ఆకస్మిక ఉద్యమాలు కావచ్చు, ప్రణాళికాబద్ధ ఉద్యమాలు కావచ్చు రెండింటికీ ప్రజాస్వామ్యంలో స్థానం ఉంది. ఒకటి సమాజంలోని బాధను బయటపెడితే, మరొకటి ఆ బాధకు పరిష్కారం వెతుకుతుంది.అందువల్ల ఏ ఉద్యమాన్నీ అతిగా మహిమాపరచాల్సిన అవసరం లేదు. అలాగే ఏ ఉద్యమాన్నీ చిన్నచూపు చూడాల్సిన అవసరమూ లేదు. చరిత్రను ముందుకు నడిపే రెండు చక్రాలుగా వాటిని అర్థం చేసుకున్నప్పుడే సమాజ పరిణామాన్ని సమగ్రంగా అర్థం చేసుకోగలం. అదే చరిత్ర మనకు నేర్పే అసలైన పాఠం.

# విగ్రహాలు కాదు ఆశయాల అమలే!



ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తులు కొందరే ఉంటారు. వారు పదవుల వల్ల కాదు, సంపద వల్ల కాదు, ప్రజల కోసం చేసిన త్యాగాల వల్ల చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. అలాంటి మహోన్నత వ్యక్తిత్వం ప్రజాకవి, ప్రజాగాయకుడు గద్దర్. తన గళంతో కోట్లాది మందిలో చైతన్యాన్ని నింపిన ఆ ప్రజా గొంతుక మూగబోయి మూడేళ్లు పూర్తవుతున్నా, ఆయన పాటలు ఇప్పటికీ తెలంగాణ నేలలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. గద్దర్ శరీరంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, ఆయన పాటలు, ఆయన చూపిన పోరాట మార్గం ప్రజల మనసుల్లో ఇంకా సజీవంగానే ఉన్నాయి.గద్దర్ కేవలం ఒక గాయకుడు కాదు. ఆయన ఒక ఉద్యమం. ఒక భావజాలం. ఒక నిరంతర ప్రజా ప్రయాణం. శ్రమజీవుల జీవితాలను, అణగారిన వర్గాల బాధలను, రైతుల ఆవేదనను, కూలీల కన్నీటిని తన పాటల్లో పలికించిన ప్రజా కళాకారుడు. ప్రజల బాధ తన బాధగా భావించి, కళను ఆయుధంగా మార్చి సామాజిక మార్పు కోసం జీవితాంతం పోరాడిన అరుదైన వ్యక్తి. ఆయన పాట వినిపిస్తే సభల్లో ఉత్సాహం పొంగిపొర్లేది. ఆయన వేదికపైకి వస్తే ప్రజల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరిసేది. అదే గద్దర్ ప్రత్యేకత.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ పోషించిన పాత్రను చరిత్ర ఎన్నటికీ మరచిపోదు. రాజకీయ నాయకుల ప్రసంగాల కంటే ఆయన ఒక్క పాట వేల మందిని ఉద్యమంలోకి తీసుకొచ్చింది. తెలంగాణ నేలలో శ్రామిక ప్రజల చెమట చుక్కలను ఉద్యమ జ్వాలలుగా మార్చిన గొంతుక గద్దర్. బుర్రకథలు, జానపద గీతాలు, ఆటలు, పాటల ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రజల్లో నింపారు. సబ్బండ వర్గాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఉద్యమానికి సామాజిక బలం చేకూర్చారు. ప్రత్యేక తెలంగాణ కోసం అగ్నిపర్వతంలా రగులుతున్న ప్రజల ఆకాంక్షకు ఆయన కళ మరింత శక్తినిచ్చింది.ప్రజా ఉద్యమాల విషయంలో గద్దర్ ఎప్పుడూ రాజీపడలేదు. అధికారాలు మారినా, ప్రభుత్వాలు మారినా ఆయన వైఖరిలో మార్పు రాలేదు. పీడితుల పక్షాన నిలబడటమే తన జీవిత లక్ష్యంగా భావించారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, సమానత్వాన్ని కోరడం, రాజ్యాంగ విలువలను కాపాడడం ఆయన జీవిత ధ్యేయంగా మారింది. ఉద్యమాల కోసం తన ప్రాణాన్నే పణంగా పెట్టిన వ్యక్తి. తనపై కాల్పులు జరిపి హత్యాయత్నానికి పాల్పడిన వారిపట్ల కూడా ద్వేషం పెంచుకోకుండా క్షమించే విశాల హృదయం ఆయనది. అలాంటి వ్యక్తిత్వాలు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తాయి.గద్దర్ చివరి వరకు ప్రజల మధ్యే జీవించారు. రాజకీయంగా కొన్ని నిర్ణయాలు విమర్శలకు గురైనా, ప్రజా సమస్యల విషయంలో మాత్రం ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఎక్కడ ప్రజల పక్షాన తన అవసరం ఉందని భావించారో అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఉద్యమాల పట్ల ఆయన నిబద్ధత ఎన్నడూ తగ్గలేదు. అందుకే గద్దర్ మరణం ఒక వ్యక్తి మరణం కాదు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో గద్దర్ ప్రభావం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. ఎన్నికల ముందు గద్దర్ ఆశయాలు, ఆయన ప్రజాదరణ, ఆయనతో కాంగ్రెస్ నాయకత్వం ఏర్పరుచుకున్న అనుబంధం ప్రజల్లో ఒక విశ్వాసాన్ని కలిగించింది. గద్దర్ ఆశయాలను అమలు చేస్తామని, ప్రజా పాలనకు కట్టుబడి ఉంటామని, ఉద్యమ విలువలను గౌరవిస్తామని కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించింది. గద్దర్ పేరును ప్రస్తావిస్తూ ప్రజల్లోకి వెళ్లింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో ఆశించిన వేగం కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రత్యేకంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చేసిన ప్రకటన ఇప్పటికీ అమలుకాలేదు. ప్రజాకవికి తగిన గౌరవం అందిస్తామని చెప్పిన మాటలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. ప్రజల కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తికి కేవలం ప్రకటనల రూపంలో గౌరవం తెలపడం సరిపోదు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే నిజమైన నివాళి.గద్దర్ పేరుతో ప్రకటించిన అవార్డుల విషయంలో కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆయన పేరు పెట్టిన అవార్డులు ఆయన ఆశయాలకు అనుగుణంగా అందుతున్నాయా? శ్రమజీవుల జీవితాలను ప్రతిబింబించే కళాకారులు, సామాజిక చైతన్యాన్ని పెంచే రచయితలు, ప్రజా గాయకులు, జానపద కళాకారులు, విప్లవ సాహిత్య సృష్టికర్తలకు ఆ గుర్తింపు దక్కుతోందా? లేక కేవలం పేరు మాత్రమే గద్దర్‌ది, అవార్డుల ఆత్మ మాత్రం వేరే దిశగా నడుస్తోందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.గద్దర్ జీవితమంతా రాజ్యాంగ విలువల కోసం సాగింది. సమాన హక్కులు, సామాజిక న్యాయం, పౌర హక్కుల పరిరక్షణ కోసం ఆయన నిరంతరం పోరాడారు. రాజ్యాంగం సంపూర్ణంగా అమలు కావాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రజల్లోకి వెళ్లారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన దృష్టిలో రాజ్యాంగం కేవలం పుస్తకం కాదు; అది పీడిత ప్రజల రక్షణ కవచం. అందుకే గద్దర్ ఆశయాలను గుర్తు చేసుకోవడం అంటే రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడం.నేడు తెలంగాణలో గద్దర్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా ఉద్యమాలకు ఒక దిశ చూపే గొంతుక అవసరం ఎంత ఉందో సమాజం మరోసారి గుర్తిస్తోంది. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించే, అధికారాన్ని ప్రశ్నించే, బలహీన వర్గాలకు అండగా నిలిచే స్వరాలు తగ్గిపోతున్నాయనే ఆందోళన ఉంది. అలాంటి సమయంలో గద్దర్ చూపిన మార్గాన్ని కొత్త తరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, విద్యాసంస్థలు, ప్రజాసంఘాలపై ఉంది.గద్దర్‌కు నిజమైన గౌరవం విగ్రహాలతో మాత్రమే పరిమితం కాకూడదు. ఆయన పేరుతో రాష్ట్ర స్థాయిలో పరిశోధనా సంస్థలు ఏర్పాటు చేయాలి. గద్దర్ జీవిత తత్వం, ప్రజా సాహిత్యం, జానపద కళలు, సామాజిక ఉద్యమాలపై అధ్యయనం చేసే రీసెర్చ్ సెంటర్లను నెలకొల్పాలి. ఆయన రచనలు, పాటలు, ప్రసంగాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. యువతకు గద్దర్ ఆలోచనలను పరిచయం చేసే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.అంతేకాదు, గద్దర్ పేరుతో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు శాశ్వత స్కాలర్‌షిప్ పథకాన్ని రూపొందించాలి. ఆర్థికంగా వెనుకబడిన యువత ఉన్నత విద్యను అభ్యసించేలా చట్టబద్ధమైన నిధిని ఏర్పాటు చేయాలి. శ్రమజీవుల జీవన విధానం, ఉత్పత్తి సంబంధాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, జానపద సంస్కృతిపై పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి. గద్దర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ఇవే బలమైన అడుగులు.విద్యా వ్యవస్థలో కూడా గద్దర్‌కు తగిన స్థానం కల్పించాలి. కేజీ నుంచి పీజీ వరకు ఆయన జీవిత చరిత్ర, ప్రజా సాహిత్యం, సామాజిక సేవ, ఉద్యమ ప్రస్థానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి. భవిష్యత్ తరాలు గద్దర్‌ను కేవలం ఒక గాయకుడిగా కాకుండా, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన మహనీయుడిగా తెలుసుకునే అవకాశం కల్పించాలి. ఆయన పాటల్లో నిక్షిప్తమైన సామాజిక సందేశాలు కొత్త తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.ప్రజాసంఘాలు, ఉద్యమ సంస్థలు కూడా గద్దర్ ఆశయాలను కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం చేయకూడదు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగించడం, పీడితుల పక్షాన నిలబడటం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం, సామాజిక న్యాయం కోసం ఉద్యమించడం ద్వారానే గద్దర్‌కు నిజమైన నివాళి అర్పించినవారమవుతాం. ప్రభుత్వం కూడా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధానాలను అమలు చేస్తేనే గద్దర్ కలలుగన్న సమాజ నిర్మాణానికి అర్థం ఉంటుంది.గద్దర్ జీవితమంతా ఒక సందేశం. ఆయన పాట ప్రతి ఒక్కరినీ ప్రశ్నించమని నేర్పింది. ఆయన పోరాటం సమాజం కోసం ఎలా జీవించాలో చూపించింది. ఆయన ఆశయాలు కేవలం గతానికి చెందినవి కావు; వర్తమానానికి, భవిష్యత్తుకూ మార్గదర్శకాలు. అందుకే గద్దర్‌కు నిజమైన నివాళి అంటే ఆయన పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం కాదు, ఆయన కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు, ప్రజా పాలనను ఆచరణలో పెట్టడం. అదే గద్దరన్నకు తెలంగాణ సమాజం అందించగల అత్యున్నత గౌరవం.

# ఉస్మానియా ఎదురు చూస్తోంది...



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు.. ఉద్యమానికి ఊపిరి పోసిన చైతన్య కేంద్రం. వేలాది మంది విద్యార్థులు తమ విద్యను పక్కనపెట్టి రాష్ట్ర సాధన కోసం వీధుల్లోకి వచ్చారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే తెలంగాణ కల సాకారమైంది. కానీ స్వరాష్ట్రం వచ్చిన తర్వాత ఉస్మానియా ఆశించిన గౌరవం, అభివృద్ధి దక్కిందా? అనే ప్రశ్నకు సమాధానం మాత్రం ఆశాజనకంగా కనిపించడం లేదు.ప్రతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉస్మానియా అభివృద్ధి గురించి గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా భిన్నంగా వ్యవహరించలేదు. ఉస్మానియాను ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు రూ.1,000 కోట్ల నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. ఆ ప్రకటనతో విద్యార్థులు, అధ్యాపకులు కొత్త ఆశలు పెట్టుకున్నారు. కానీ కాలం గడిచింది... హామీ మాత్రం ఫైళ్లకే పరిమితమైంది.నేటికీ విశ్వవిద్యాలయంలో అనేక భవనాలు శిథిలావస్థలోనే ఉన్నాయి. వర్షం వస్తే హాస్టళ్లలో భయం, తరగతి గదుల్లో అసౌకర్యం, పరిశోధనలో వసతుల కొరత విద్యార్థులను వెంటాడుతున్నాయి. దేశంలో అత్యుత్తమ విద్యాసంస్థలతో పోటీ పడాల్సిన ఉస్మానియా, కనీస మౌలిక వసతుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం.తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను "రాష్ట్ర భవిష్యత్తు"గా కొనియాడిన రాజకీయ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విద్యార్థుల సమస్యలను మరచిపోవడం విచారకరం. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోతే, ప్రజల్లో రాజకీయాలపై విశ్వాసం దెబ్బతినడం సహజం.ఉస్మానియా అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు నిర్మించడం కాదు. అది తెలంగాణ విద్యా ప్రతిష్ఠను పెంచడం. పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వడం. ప్రపంచ స్థాయి అవకాశాలను విద్యార్థులకు అందించడం. యువత భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడం. అందుకే ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులు ఇకపై ప్రకటనల్లో కాకుండా పనుల్లో కనిపించాలి.ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. ఆ ప్రతీకను నిర్లక్ష్యం చేయడం అంటే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తినే నిర్లక్ష్యం చేసినట్టే. ప్రభుత్వం ఇకనైనా హామీల రాజకీయాన్ని పక్కనబెట్టి, నిధులు విడుదల చేసి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి. ఎందుకంటే ఉస్మానియా కోరుకుంటోంది ప్రశంసలను కాదు... తన స్థాయికి తగిన గౌరవాన్ని. ఆ గౌరవం మాటల్లో కాదు, చేతల్లో కనిపించినప్పుడే తెలంగాణ ఉన్నత విద్య నిజమైన అర్థంలో ముందుకు సాగుతుంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

## మూడు జిల్లాలకు అధ్యక్షుల ప్రకటన

### స్టేట్ బీజేపీలో కీలక పరిణామం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భారతీయ జనతా పార్టీ లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్షుల నియామకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఇవాళ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం , వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ.రమేశ్ , మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి లను నియమించారు.అయితే, ఈ మూడు జిల్లాల అధ్యక్షుల ఎంపిక విషయంలో పార్టీ కీలక నేతలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ నడుమ తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. తమ వర్గానికి చెందిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు నేతలు పట్టుబట్టడంతో గత కొంతకాలంగా సదరు నియామకాలను పార్టీ నాయకత్వం హోల్డ్‌లో పెట్టింది. ఇటీవల ఇరువురి నేతల మధ్య విస్తృత చర్చలు జరిగి సయోధ్య కుదరడంతో, అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన పేర్లను ఖరారు చేస్తూ రాష్ట్ర అధినాయకత్వం తుది నిర్ణయం తీసుకున్నది.

## జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న భారీ వరద

**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద కొనసాగుతోంది. వరద ఉద్ధృతి పెరగడంతో ప్రాజెక్టు అధికారులు గురువారం ఉదయం 29 గేట్లను ఎత్తి కృష్ణానదిలో భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2,42,645 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఇందులో అధిక భాగం నీటిని 29 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే జూరాల జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, సాగునీటి కాలువలు, లిఫ్ట్ పథకాల ద్వారా కూడా అవసరమైన మేరకు నీటిని వదులుతున్నారు. మొత్తం 2,40,319 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతోంది.జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.48 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే ప్రాజెక్టు దాదాపు నిండే స్థితికి చేరుకుంది. భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రవ-ుత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదిలోకి చేపల వేటకు వెళ్లరాదని, నది ఒడ్డున అనవసరంగా సంచరించవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# బట్టకాల్చి మీదేస్తే ఊరుకునేది లేదు..

### కాంగ్రెస్ నేతలకు హరీశ్ రావు మాస్ వార్నింగ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇవాళ ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో కూడా రాష్ట్రంలో వర్షాలు కురవద్దంటూ తాను క్షుద్రపూజలు చేశానని కాంగ్రెస్ నేతలు తనపై నిందలు వేయడం సిగ్గుచేటని అన్నారు. రాజకీయాల్లో విమర్శలకు కూడా ఓ హద్దంటూ ఉంటుందని.. ఏదిపడితే అది బట్టకాల్చి మీదేస్తే తాను ఊరుకునే రకం కాదని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరీశ్ రావు మాస్ వార్నింగ్ ఇచ్చారు.

**ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే..**

గతంలో కూడా మంత్రి కొండా సురేఖ ఇలాగే నోటికొచ్చినట్లుగా మాట్లాడి ఇవాళ నాంపల్లి కోర్టు చుట్టూ తిరుగుతా ఉన్నారని హరీశ్ రావు అన్నారు. క్షుద్రపూజల ఆరోపణ అంశంలో ఇష్టం వచ్చిన మాట్లాడిన కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ సూట్, పరువు నష్టం కేసును వేయ-ంబోతున్నానని.. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చానని అన్నారు. మెయిల్ లీగల్ యాక్షన్‌కు ఇంకా 30 రోజుల టైమ్ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పిదాలు, స్కాములను ఎత్తిచూపుతున్న నేపథ్యంలోనే రాజకీయంగా ఎదుర్కోలేక తనపై బురదజల్లేందుకు, డైవర్షన్ పాలిటిక్స్ కాంగ్రెస్ నేతలు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మైనింగ్ స్కామ్, నాదర్‌గుల్ భూముల వ్యవహారం, గురుకుల టెండర్ల అవినీతి బయటపెట్టామనే ఆక్రోశంలో ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతాంగం నీళ్లు లేక అల్లాడుతుంటే.. దేవాదులలో 10 మోటార్లు ఉన్నా.. నేటికీ 4 మోటార్లు మాత్రమే నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రజల హక్కులు, రైతాంగం, విద్యార్థుల పక్షాల తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని.. తగ్గేదేలేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# సింగరేణి చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం..




**ఒడిశా :** తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చే దిశగా సింగరేణి చరిత్రలోనే ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని 'నైనీ' బొగ్గు బ్లాక్, ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధితో ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఒడిశాలోని నైనీ గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు విజయవంతంగా చేరుకుంది. ఇది తెలంగాణ ఇంధన భద్రతలో ఒక అద్భుతమైన మైలురాయిగా నిలిచింది.ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు.ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 (G-10) గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

### మా గురువు జయశంకర్ సార్.. మీ గురువు చంద్రబాబు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీ పార్టీల చేతుల్లో మరోసారి తెలంగాణ తల్లడిల్లుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణకు నీటి వాటా విషయంలో మళ్లీ అన్యాయం చేసేందుకు ఏపీ ప్రయత్నిస్తోందని, తమ ఆధీనంలో ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డ పెట్టుకుని ఏపీ ప్రభుత్వం ఆడిస్తోందని అన్నారు. అదే తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ అధికారంలో ఉండి ఉంటే ఈ పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ ఏర్పాటుతో ఓ బీజేపీ ఎంపీ లోక్ సభలో మాట్లాడితే బీజేపీ, కాంగ్రెస్ కు చెందిన ఒక్క ఎంపీ అయినా మాట్లాడారా? వారికి రోషం అనేది ఉందా? అని నిలదీశారు. అదే బీఆర్ఎస్ సభ్యుడు ఉండి ఉంటే వెళ్లి ఏం మాట్లాడుతున్నావని గల్లాపట్టకపోయేవాడా అని అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడిన కేటీఆర్.. ఏ రంగంలోనైనా జయశంకర్ సార్‌కు అద్భుతమైన అవగాహన ఉండేదని తాను అవగాహన పెంచుకుని ఇతరులకు పంచే ప్రయత్నం చేసే వ్యక్తి జయశంకర్ సార్ అని గుర్తు చేశారు.

**చంద్రబాబుకు వంతపాడటమే పని:**

భౌగోళిక సాధించుకున్నా మళ్లీ ఢిల్లీకి సామంతులుగా బతకాల్సిన పరిస్థితి ఈ ముఖ్యమంత్రి తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్రంలో నీళ్లు పుష్కలంగా ఉన్నా పాలమూరు, కన్నెపల్లి పంపులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆన్ చేయడం లేదని విమర్శించారు. మనకు జయశంకర్ సార్ గురువు అయితే రేవంత్ రెడ్డికి పక్క రాష్ట్రం సీఎం చంద్రబాబు నాయుడు గురువు అని అన్నారు. చంద్రబాబుకు వంత పాడటం తప్ప తెలంగాణ ప్రయోజనాలు ఈ సీఎంకు పట్టవన్నారు. కనీసం జై తెలంగాణ అనడానికి కూడా మనసొప్పని సీఎం మనకు ఉండటం మన దౌర్భాగ్యం అని, కేంద్ర ప్రభుత్వమే స్వయంగా కేసీఆర్ అప్పులు చేయలేదని చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా పరిస్థితి మారిందని జయశంకర్ సార్ మళ్లీ వచ్చి ఇలాంటి వారికి పాఠాలు చెబితే బాగుండు అన్నారు. జీవితంలో ఎన్నడూ జై తెలంగాణ అనని జైపాల్ రెడ్డి, కేశవరావు మాత్రమే తెలంగాణలో మేధావులు అని సీఎం అంటున్నారు. మరి జయశంకర్ సార్, విద్యాసాగర్ లాంటి వారు ఎటుపోయారని కేటీఆర్ ప్రశ్నించారు.

## కేటీఆర్‌పై ఏసీబీ 75 పేజీల ఛార్జిషీట్


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫార్ములా ఈ-రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ 75 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాపై రూ.600 కోట్ల భారం మోపేలా నేరపూరిత కుట్ర పన్నారని ఆరోపించింది. ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్‌లను నిందితులుగా చేర్చింది. కేబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండా నిర్ణయాలు తీసుకున్నారని ఏసీబీ పేర్కొంది. ప్రమోటర్ సంస్థ అనుబంధ కంపెనీల నుంచి బీఆర్ఎస్‌కు రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు అందాయని, దానికి ప్రతిఫలంగా రేసింగ్ బాధ్యతలు అప్పగించారనే క్విడ్ ప్రోకో కోణాన్ని ఏసీబీ ప్రస్తావించింది. హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.46.82 కోట్లు చెల్లించారని, కేటీఆర్‌పై ఐపీసీ 409, 120బీతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది.



## మెటా సంస్థపై అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం


**న్యూఢిల్లీ:** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో తన ఖాతాను ఎందుకు నియంత్రించారని ఆయన ప్రశ్నించారు. తన అకౌంట్ నియంత్రణపై మెటా అధికారులను ప్రశ్నిస్తే సరిగా సమాధానం ఇవ్వడం లేదని, ఈమెయిల్ పంపినా కూడా స్పందించడం లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లకు తలగొద్దని మోటా సంస్థకు కేజ్రీవాల్ సూచించారు.తన సోషల్ మీడియా ఖాతాను భారత్‌లో ఎందుకు నిలిపివేశారో సంస్థ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మెటా ఇండియా కార్యాలయంలో మౌఖికంగా విచారించినా ఎలాంటి సరైన సమాధానం రాలేదని, తాము పంపిన ఈమెయిల్స్‌కు సాధారణ రసీదులు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. ఇది చాలా చెత్త సేవ అంటూ అసహనం వ్యక్తం చేశారు.'ప్రధాని మోదీకి ఒత్తిళ్లకు తలవంచకండి.. లేదంటే భవిష్యత్తులో దేశంలో ప్రధాని ఖాతా ఒక్కటే నడుపుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తారు' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మెటా సంస్థ తన సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కేజ్రీవాల్ అన్నారు. కాగా, దేశంలో మెటా సంస్థపై ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రభుత్వ నిఘా, విచారణ కొనసాగుతున్న తరుణంలో కేజ్రీవాల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం..



**ఉత్తరప్రదేశ్ :** గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతిక్ అహ్మద్ చిన్న కుమారుడు అబాన్ అహ్మద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ-కాన్పూర్ జాతీయ రహదారిపై అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అబాన్ అహ్మద్‌ను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించినప్పటికీ, మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లుగా వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, కొన్ని ఏళ్ల క్రితం పోలీసు ఎన్‌కౌంటర్‌లో అతిక్ అహ్మద్ పెద్ద కుమారుడు అసద్ అహ్మద్ మరణించగా, తాజాగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన చిన్న కొడుకు అబాన్ అహ్మద్ మృతి చెందడంతో అతిక్ అహ్మద్ ఫ్యామిలీ కన్నీరుమున్నీరవుతోంది.

# ఇంతకీ ఆ బాలికకు ఏమైంది?



**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** జగిత్యాల జిల్లా కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న 13 ఏళ్ల మైనర్ విద్యార్థిని తల్లిదండ్రులకు ఉద్దేశించి లేఖ రాసి కనిపించకుండా పోవడం జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది. బుధవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఉపాధ్యాయులు తరగతుల్లో బిజీగా ఉన్న సమయంలో ఎవరూ గమనించకుండా విద్యార్థిని స్కూల్ నుంచి వెళ్లిపోయినట్లు ప్రాథమిక సమాచారం. తనతో తీసుకొచ్చిన మరో దుస్తులను ధరించి, యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్, బూట్లను స్కూల్ ఆవరణలోనే వదిలేసి, బ్యాగ్‌లో తల్లిదండ్రులకు ఉద్దేశించిన లేఖను ఉంచి వెళ్లిపోయింది.అనంతరం ఉపాధ్యాయులు విషయం గమనించి వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి, బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు సుమారు పదేళ్ల క్రితం మధ్యప్రదేశ్ నుంచి వలస వచ్చి, జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పానీపూరి బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాలిక ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్కూల్ నుంచి వెళ్లిపోవడంతో, ఆమె మధ్యప్రదేశ్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి ఉండవచ్చనే కోణంలో కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.అయితే విద్యార్థిని నిజంగానే మధ్యప్రదేశ్‌కు వెళ్లిందా? లేక ఎవరైనా ప్రలోభపెట్టి తీసుకెళ్లారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, లేఖలో పేర్కొన్న "చాలా మంది ఇబ్బంది పెడుతున్నారు" అనే వ్యాఖ్యల వెనుక అసలు కారణాలేమిటి? ఆ ఇబ్బందులు వ్యక్తిగతమా, పాఠశాలకు సంబంధించినవా, లేక మరేదైనా అంశమా? అనే కోణాల్లోనూ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాలికను త్వరగా గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆమె తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ప్రభుత్వంతో చర్చిస్తున్నాం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు.ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

## మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణశీలోనీ గ్రంధాలయం లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమం మరియు గద్దర్,వర్ధంతి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమం లోసామాజిక వేత్త డాక్టర్ రాజు,లైబ్రరియన్ కుమ్మరి కుంట్ల సుధాకర్,కస్తూరి ప్రభాకర్,దాసరాజు జయరాజు,బీసీ జేఏసీ నాయకులు చేగొండి మురళీ యాదవ్, కందుకూరి సుదర్శన్,లక్ష్మి నారాయణ,గ్రంథాలయ పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు ఘన నివాళి

**మేడ్చల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితం అందరికి ఆచరణీయమని, ఎంతో స్ఫూర్తి దాయకమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టరు జ్యోతి ప్రజ్వలన చేసి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఉద్యోగి, పౌరుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తే, అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ సార్ కు ఘన నివాళి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు గురువారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఏవో మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలికి చేయూత



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తివీరప్పగూడ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు అయినటువంటి చిలుముల సైదమ్మ కి కీ'శే' నారాబత్తుల జనార్దనా చారి జ్ఞాపకార్థం గా వారి కుమారుడు నారబత్తుల ఉదయ్ కుమార్ 25kg ల బియ్యం,రెండు నెలలకు సరిపడు నిత్యావసర వస్తువులు మరియు కూరగాయలు అందివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సైదమ్మ కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.



# చిన్న చినుకుకే జలమయం..

**ఘట్కేసర్,ఫ్లాష్ ఇండియా :** చిన్న చినుకు పడితే చాలు.. ఘట్కేసర్ పట్టణ కేంద్రంలోని రోడ్లన్నీ కుంటలను తలపిస్తున్నాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి హైదరాబాద్--వరంగల్ జాతీయ రహదారి కింద ఉన్న అండర్‌పాస్ వరకు ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలిచి చెరువులను తలపించేలా మారింది. గురువారం సాయంత్రం కురిసిన జడివానకే పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశాలు నిర్వహించిన మున్సిపల్ అధికారులు, ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చిన్న చినుకుకే పరిస్థితి ఇలా ఉంటే.. భారీ వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలి

## ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలు





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, భావజాలం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ హాజరై, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహ రావు, వైటిడిఎ సభ్యులు లక్ష్మి నారయణ నాయక్, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామేశ్వర చారి, ఆరే కుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు లింగాజి, జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి హరీష్, బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులు గంగ భవాని , ఇతర కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నెట్ మీటర్ల కొరతతో నిలిచిపోయిన సోలార్ ప్రాజెక్టులు...

**మూడు నెలలుగా నెట్ మీటర్లు అందుబాటులో లేక కమిషనింగ్‌లో జాప్యం**
**సబ్సిడీ విడుదల నిలిచిపోవడంతో వెండర్లపై ఆర్థిక భారం... విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ వినియోగదారుల ఆవేదన**




**సూర్యాపేట, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న PM సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఏర్పాటు చేసిన అనేక రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులు నెట్ మీటర్ల కొరత కారణంగా కమిషనింగ్ కోసం నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. వెండర్ల ప్రకారం, గత మూడు నెలలుగా TGSPDCL సూర్యాపేట స్టోర్‌లో నెట్ మీటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల వందలాది ప్రాజెక్టులు నిలిచిపోయాయి.దీంతో సోలార్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నప్పటికీ వినియోగదారులు వాటి పూర్తి ప్రయోజనాన్ని పొందలేకపోతున్నారు. కమిషనింగ్ పూర్తికాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ విడుదల ఆలస్యం అవుతోంది. అదే సమయంలో వినియోగదారులు సాధారణ విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వెండర్లు కూడా ప్రాజెక్టులు పూర్తయినా చెల్లింపులు నిలిచిపోవడం, పెట్టుబడులు తిరిగి రాకపోవడం, బ్యాంకు రుణాలు మరియు ఇతర ఆర్థిక బాధ్యతల ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.వినియోగదారులు, వెండర్లు కలిసి సంబంధిత అధికారులు ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకుని అవసరమైన నెట్ మీటర్లను అందుబాటులో ఉంచి పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన కమిషన్ చేయాలని కోరుతున్నారు.

# మా టీచర్ మాకే కావాలి



**ఎర్రుపాలెం,ఫ్లాష్ ఇండియా :** 'మా టీచర్ మాకే కావాలి' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు గురువారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల ఉన్నత పాఠశాల గేటుకు తాళం వేసి చేపట్టిన ఆందోళనకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంఈఓ మురళీమోహన్‌రావు పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థుల, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో జరిగిన పరిణామాల పై చర్చించిన ఎంఈఓ పొరపాటు జరిగిందని అంగీకరించినట్లు ఆందోళనకారులు తెలిపారు.అనంతరం సోషల్ ఉపాధ్యాయురాలు స్రవంతిని తిరిగి రేమిడిచర్ల ఉన్నత పాఠశాలకు పిలిపించి, అక్కడే విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధన కొనసాగించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. స్రవంతి రేమిడిచర్ల పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధిస్తున్నారని, ఆమెను ఇతర పాఠశాలకు కేటాయించడంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందులు ఏర్పడతాయని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌పై అధికారులు సానుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించినట్లు తెలిపారు.

**విద్యార్థుల డిమాండ్ నెరవేరడంతో హర్షం..**

తమ ఉపాధ్యాయురాలిని తిరిగి రేమిడిచర్ల పాఠశాలలోనే కొనసాగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన ఎంఈఓకు వారు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయుల సర్దుబాట్లలో స్పష్టతతో వ్యవహరించాలని కోరారు.

# మహిళల నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి






**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సైబర్, లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మహిళల సమస్యల పరిష్కారానికి మహిళా కమిషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, స్టాకింగ్, ఫేక్ అకౌంట్లు సృష్టించడం, సోషల్ మీడియాలో వేధింపులు, అనుమతి లేకుండా ఫోటోలు ప్రచారం చేయడం చట్టరీత్యా నేరాలేనని హెచ్చరించారు. దీచీూ సెక్షన్-78 ప్రకారం స్టాకింగ్‌కు మూడు నుంచి ఆరు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.మహిళలు సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, వేధింపులు ఎదురైతే స్క్రీన్‌షాట్లు భద్రపరచి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సైబర్, లైంగిక వేధింపుల నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.

# పోలీసులు – మీ కోసం



**నేరడిగొండ,ఫ్లాష్ ఇండియా :** నేరడిగొండ మండలంలోని వాగ్దరి గ్రామంలో ఆగస్టు 7, 2026 (శుక్రవారం) నిర్వహించనున్న 'పోలీసులు - మీ కోసం' ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ప్రజల సంక్షేమం, భద్రత, చట్టాలపై అవగాహన కల్పించడం, యువతను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ప్రధాన కార్యక్రమాల్లో భాగంగా పోలీస్ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. యువతను ప్రోత్సహించేందుకు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనుండగా, విద్యార్థుల కోసం పెయింటింగ్ పోటీలు కూడా ఏర్పాటు చేశారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం, చట్టాలపై ప్రజలతో ముఖాముఖి అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత సేవలను వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, గ్రామస్తులు అందరూ పాల్గొని 'పోలీసులు -- మీ కోసం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నూతన ఫుడ్ స్టోరేజ్ గోదాం నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ఫుడ్ స్టోరేజ్ గోదాం నిర్మాణ పనులకు గురువారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి, భూమిపూజ నిర్వహించి అధికారికంగా పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన వేములపల్లి మండలంలో ఫుడ్ స్టోరేజ్ గోదాం ఏర్పాటు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పంట దిగుబడులను శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసుకునే అవకాశం కలగడంతో రైతులకు నాణ్యమైన నిల్వ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టాలు తగ్గి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నిల్వ సదుపాయాల విస్తరణకు కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు,కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి



**భిక్కనూరు,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. గురువారం ఆయన 'దిశ'తో మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సహకారంతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.75.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా, ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం రోడ్లు-భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.భిక్కనూరులో రూ.20 కోట్ల వ్యయంతో కేజీ నుంచి పీజీ వరకు విద్య అందించే ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైనట్లు తెలిపారు. అలాగే, భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు తిరుపతి భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# వైభవ్‌పై బట్లర్ ఆసక్తికర వ్యాఖ్యలు..

టీ20 క్రికెట్ చరిత్రలో ఇంగ్లాండ్ విధ్వంసకర బ్యాటర్ జోస్ బట్లర్ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. 'ది హండ్రెడ్' టోర్నీలో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతూ వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో బట్లర్ ఈ ఘనత సాధించాడు. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ (14,803 పరుగులు) రికార్డును అధిగమించి, టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు రికార్డు సాధించడానికి 22 పరుగులు అవసరం కాగా, బట్లర్ కేవలం 20 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో విరుచుకుపడి నాటౌట్‌గా 51 పరుగులు చేశాడు. దీంతో అతని టీ20 కెరీర్ స్కోరు 522 మ్యాచ్‌ల్లో 14,833 పరుగులకు చేరింది. ఈ చారిత్రక మైలురాయిని చేరుకున్న అనంతరం బట్లర్ చేసిన వ్యాఖ్యలు భారత క్రికెట్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. టీ20లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని, అయితే రికార్డులు తుదివరకు నిలవవని బట్లర్ అన్నాడు. భవిష్యత్తులో తన ప్రపంచ రికార్డును తిరగరాసే సత్తా భారత్‌కు చెందిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకే ఉందని బట్లర్ జోస్యం చెప్పాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించిన వైభవ్, టీ20లలో ఇప్పటికే 40 మ్యాచ్‌ల్లో 1,670 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకోవడం విశేషం. ఇక, 35 ఏళ్ల జోస్ బట్లర్ కెరీర్ ఎంతో అద్భుతంగా సాగింది. ఇంగ్లాండ్ తరఫున 160 టీ20ల్లో 4,212 పరుగులు చేసిన అతను, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 12 వేర్వేరు ఫ్రాంచైజీ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. వైటాలిటీ బ్లాస్ట్‌లో లంకాషైర్, సమర్‌సెట్.. SA20లో పార్ల్ రాయల్స్, దర్బన్స్ సూపర్ జెయింట్స్.. బిగ్ బాష్ లీగ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్, సిడ్నీ థండర్.. బీపీఎల్‌లో కమిల్లా విక్టోరియన్స్‌లకు ఆడాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ వంటి దిగ్గజ జట్లకు ఆడి తన ప్రతిభను చాటుకున్నాడు.

# దేశవాళీ క్రికెట్‌లో 9 వేల రన్స్..




భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ఏమాత్రం కొదవలేదు. అయితే దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించడంతోనే జాతీయ జట్టులో స్థానం ఖాయం అవుతుందని చెప్పలేం. టీమిండియాలో చోటు దక్కించుకోవడం ఎంత కష్టమో.. దాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కష్టమైన పని. భారత జట్టులో ఉండే తీవ్రమైన పోటీ కారణంగా ఎంతో మంది ప్రతిభావంతుల కెరీర్లు ఒక్కటి లేదా రెండు మ్యాచ్‌లకే పరిమితమయ్యాయి. ఈ జాబితాలో మాజీ ఓపెనర్ 'ఫైజ్ ఫజల్' పేరు ముందువరుసలో ఉంటుంది.

**దేశవాళీ క్రికెట్‌లో 9 వేల రన్స్:**

దేశవాళీ క్రికెట్‌లో వేలాది పరుగులు చేసిన ఫైజ్ ఫజల్.. టీమిండియా తరఫున అరంగేట్ర మ్యాచ్‌లోనే అజేయ హాఫ్ సెంచరీ చేశాడు. అయినప్పటికీ అతడికి మరోసారి భారత జట్టులో అవకాశం రాలేదు. దీంతో కేవలం ఒకే ఒక్క వన్డే మ్యాచ్‌తో అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసిపోయింది. విదర్భ, రైల్వేస్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన ఫజల్ దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. 2015-16 ఫస్ట్‌క్లాస్ సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 714 పరుగులు చేసి బీసీసీఐ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఇందులో మూడు సెంచరీలు ఉండగా.. సగటు 44.62గా ఉంది. మొత్తంగా తన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 138 మ్యాచ్‌లు ఆడిన ఫజల్.. 41 సగటుతో 9,184 పరుగులు చేశాడు.


**61 బంతుల్లో అజేయంగా 55 పరుగులు:**

ఈ అద్భుత ప్రదర్శనతో 2016లో జింబాబ్వే పర్యటనకు భారత జట్టులో ఫైజ్ ఫజల్‌కు చోటు దక్కింది. అప్పటికే ఫజల్ వయసు 30 ఏళ్లు దాటడంతో.. ముప్పై ఏళ్లు దాటిన వయసులో వన్డే అరంగేట్రం చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 2016 జూన్ 15న హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఫజల్ తన తొలి వన్డే ఆడాడు. 61 బంతుల్లో అజేయంగా 55 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించినప్పటికీ.. ఆశ్చర్యకరంగా ఫజల్‌కు మళ్లీ భారత జట్టులో ఆడే ఛాన్స్ దక్కలేదు.

**2021లో క్రికెట్‌కు వీడ్కోలు:**

ఆ సమయంలో రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అజింక్య రహానే, కేఎల్ రాహుల్ వంటి స్టార్ ఓపెనర్ల మధ్య తీవ్ర పోటీ ఉండటంతో.. ఫైజ్ ఫజల్ భారత జట్టులో స్థానం నిలబెట్టుకోలేకపోయాడు. దేశవాళీ క్రికెట్‌లో ఎంతగా రాణించినా.. అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకునేందుకు మరో అవకాశం అతడికి లభించలేదు. చివరికి 2021 ఫిబ్రవరిలో ప్రొఫెషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత క్రికెట్‌లో ప్రతిభ ఒక్కటే సరిపోదని.. సరైన సమయంలో అవకాశం, అదృష్టం కూడా ఒక ఆటగాడి అంతర్జాతీయ కెరీర్‌ను నిర్ణయిస్తాయని ఫజల్‌ను చూస్తే అర్థమయిపోతుంది.

# కారణం ఇదేనట!



అమరావతిలో తన అకాడమీకి రెండోసారి భూమిపూజ నిర్వహించడంపై వస్తున్న విమర్శలకు భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు స్పందించారు. గతంలో భూమిపూజ నిర్వహించినప్పటికీ, తక్కువ సమయం ఉండటంతో తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, తనకు అండగా నిలిచిన ముఖ్యమైన వ్యక్తులు కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని ఆమె తెలిపారు. అంతేకాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు అకాడమీని క్రీడా, విద్యా సంస్థగా అభివృద్ధి చేసేలా ప్రణాళికల్లో మార్పులు చేశామని సింధు వెల్లడించారు. ఈ మార్పుల నేపథ్యంలో కొత్తగా స్థలానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తయ్యాయని, రిజిస్ట్రేషన్ అనంతరం మరోసారి భూమిపూజ నిర్వహించాల్సి వచ్చిందని వివరించారు. ఈసారి జరిగిన కార్యక్రమానికి తనకు ముఖ్యమైన వ్యక్తులంతా హాజరుకావాలని కోరుకున్నానని పీవీ సింధు ట్వీట్‌లో పేర్కొన్నారు. దీంతో రెండోసారి భూమిపూజ నిర్వహించడానికి గల కారణాన్ని ఆమె స్పష్టంగా వెల్లడించారు.



# చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో షాక్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు మరో ఎదురుదెబ్బ తగలనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఫ్రాంచైజీని వీడగా.. ఇప్పుడు బ్యాటింగ్ కోచ్ మైకేల్ హస్సీ కూడా జట్టుకు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమయ్యాడని పలు అంతర్జాతీయ మీడియాలు తమ కథనాల్లో పేర్కొన్నాయి. ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న స్టీఫెన్ ఫ్లెమింగ్.. తన కోచింగ్ బృందంలో బ్యాటింగ్ కోచ్‌గా చేరాలని మైకేల్ హస్సీని సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయంపై ఫ్లెమింగ్, హస్సీలు ఇప్పటికే చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)తో అధికారిక ఒప్పందం కుదరలేదని తెలుస్తోంది. ప్రస్తుతం 51 ఏళ్ల హస్సీ 'ది హండ్రెడ్' టోర్నీలో వెల్ష్ ఫైర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అదే సమయంలో ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్‌గా కూడా కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టులో చేరాలా? లేక సీఎస్‌కేతోనే కొనసాగాలా? అనే విషయంపై హస్సీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. స్టీఫెన్ ఫ్లెమింగ్, మైకేల్ హస్సీల మధ్య దాదాపు 15 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. 2008లో ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో ఇద్దరూ సీఎస్‌కే తరఫున కలిసి ఆడారు. అనంతరం ఫ్లెమింగ్ హెడ్ కోచ్‌గా.. హస్సీ బ్యాటింగ్ కోచ్‌గా కలిసి చెన్నై జట్టుకు ఎన్నో విజయాలు అందించారు. ఇప్పుడు అదే జోడీ ఇంగ్లండ్ జట్టులో కూడా కనిపించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఫ్లెమింగ్ డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనతో ఇంగ్లండ్ టెస్ట్ జట్టు కోచ్‌గా అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో జరిగే మూడు టెస్ట్‌ల సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోతిక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. బౌలింగ్ కోచ్ విషయంలో కూడా సీఎస్‌కేతో అనుబంధం ఉన్న మరో కోచ్ ఎరిక్ సిమన్స్‌ను ఇంగ్లండ్ జట్టులోకి తీసుకురావాలని స్టీఫెన్ ఫ్లెమింగ్ ప్రయత్నిస్తున్నాడట. ప్రస్తుతం సిమన్స్ సీఎస్‌కేకు బౌలింగ్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నాడు. గతంలో భారత జట్టు 2011 వన్డే ప్రపంచ కప్ గెలిచిన సమయంలో బౌలింగ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. దక్షిణాఫ్రికా జట్టులో కోచ్‌గా పనిచేశారు. ఒకవేళ హస్సీ కూడా ఇంగ్లండ్ జట్టులో చేరితే.. చెన్నై కోచింగ్ విభాగంలో భారీ మార్పులు తప్పవు. ఇప్పటికే జట్టు ప్రదర్శన అంతంత మాత్రంగా ఉంది.. ఇప్పుడు హస్సీ కూడా వెళ్ళిపోతే సీఎస్‌కే పరిస్థితి దారుణంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చెన్నై భవిష్యత్‌పై ఫాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బిజినెస్

## ఎనర్జీ స్టోరేజ్‌లో యాక్సిస్ ఎనర్జీతో..




దేశీయ క్లీన్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేస్తూ, 2032 నాటికి 20 గిగావాట్ అవర్స్ సామర్థ్యం గల 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' (బీఈఎస్ఎస్)ను ఏర్పాటు చేయడానికి ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ 'యాక్సిస్ ఎనర్జీ'తో కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆగస్టు 15న అధికారికంగా ప్రారంభం కానున్న ఓలా తొలి ఎనర్జీ స్టోరేజ్ ప్లాట్‌ఫామ్ 'ఓలా మహాశక్తి'కి లభించిన మొదటి అతిపెద్ద వ్యాపార మైలురాయి ఇది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనాల ప్రకారం 2032 నాటికి దేశంలో 400 గిగావాట్ అవర్స్‌కు పైగా ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్యం అవసరం కానుండగా, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలో 3,750 మెగావాట్లకు పైగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు నిర్మిస్తున్న యాక్సిస్ ఎనర్జీకి ఈ స్వదేశీ బీఈఎస్ఎస్ సాంకేతికత ఎంతో కీలకం కానుంది. ఓలా ఛైర్మన్ భవిష్ అగర్వాల్, యాక్సిస్ ఎనర్జీ ఎండీ రవి కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో కుదిరిన ఈ భాగస్వామ్యం ద్వారా సెల్ తయారీ నుండి సిస్టమ్ ఇంజనీరింగ్ వరకు పూర్తిస్థాయి టెక్నాలజీతో తక్కువ ఖర్చుకే నిరంతరాయమైన, నమ్మకమైన స్వచ్ఛమైన విద్యుత్ సరఫరాను గ్రిడ్లు, డేటా సెంటర్లు, పరిశ్రమలకు అందించవచ్చని కంపెనీలు వెల్లడించాయి.

# సామాన్యుడి జేబుకు చిల్లు..




రక్షాబంధన్ నుంచి జన్మాష్టమి, గణేష్ చవితి, దీపావళి వరకు వరుస పండుగలు రానున్న వేళ సామాన్య ప్రజలకు ధరల పెరుగుదల పెద్ద ఆందోళనగా మారింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ వ్యవస్థ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం గత ఐదు నెలల్లో 16 ప్రధాన నిత్యావసర ఆహార వస్తువుల్లో 15 వస్తువుల ధరలు పెరిగాయి. అంటే దాదాపు 99 శాతం రేషన్ వస్తువులు గతంతో పోలిస్తే అధిక ధరలకు లభిస్తున్నాయి. దీంతో ప్రతి కుటుంబం నెలవారీ ఆహార వ్యయం గణనీయంగా పెరిగే పరిస్థితి ఏర్పడింది.

**పప్పుధాన్యాల ధరల్లో భారీ పెరుగుదల**

గత ఐదు నెలల్లో పప్పుధాన్యాల ధరలే అత్యధికంగా పెరిగాయి. ముఖ్యంగా కందిపప్పు కిలోకు సుమారు రూ.6 పెరిగి రూ.123.46కు చేరుకుంది. శనగపప్పు ధర కిలోకు రూ.86.66, మినపప్పు ధర రూ.121.51గా నమోదైంది. దీంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల వంటింటి ఖర్చు మరింత పెరిగింది.

**వంట నూనె, పాల ధరలూ పెరిగాయి**

వంట నూనెల ధరలు కూడా వినియోగదారులకు భారంగా మారాయి. ఆవ నూనె ధర లీటరుకు రూ.7.56 పెరిగి రూ.196.44కు చేరింది. అలాగే సోయాబీన్, పొద్దుతిరుగుడు, పామాయిల్ ధరలు కూడా 4 నుంచి 4.5 శాతం వరకు పెరిగాయి. మరోవైపు పాల ధర లీటరుకు రూ.3 పెరగడం కుటుంబాల నెలవారీ ఖర్చుపై అదనపు భారం మోపుతోంది.

**చక్కెర కూడా ఖరీదే.. పిండి మాత్రం స్థిరం**

పండుగల సీజన్‌లో స్వీట్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో పాటు చెరకు నుంచి ఇథనాల్ ఉత్పత్తి పెరగడం వల్ల చక్కెర ధర కిలోకు రూ.2.25 పెరిగి రూ.49.33కు చేరింది. అయితే గోధుమల నిల్వలు తగినంతగా ఉండటంతో పిండి ధర కిలోకు రూ.37.35 వద్ద దాదాపు స్థిరంగానే కొనసాగుతోంది. ఇది వినియోగదారులకు కొంత ఉపశమనంగా చెప్పవచ్చు.

**ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు ఇవే**

ధరల పెరుగుదలకు దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులే కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది బలహీనమైన, అనిశ్చిత రుతుపవనాల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 7 శాతం తగ్గింది. దీంతో ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందనే అంచనాలు మార్కెట్లో ధరలను పెంచుతున్నాయి. ఇక పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ సరఫరా గొలుసులను ప్రభావితం చేశాయి. భారతదేశం పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకునే పామాయిల్, సోయాబీన్ నూనెల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరగడంతో దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడింది.

**పండుగల డిమాండ్ కూడా ప్రభావం చూపుతోంది**

రక్షాబంధన్, గణేష్ చవితి, దీపావళి వంటి పండుగలను దృష్టిలో పెట్టుకుని హల్వాయిలు, ప్రాసెసర్లు, రిటైలర్లు ముందుగానే భారీగా నిల్వలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్లో డిమాండ్ ఒక్కసారిగా పెరిగి ధరలపై మరింత ఒత్తిడి ఏర్పడింది.

**ముందు రోజుల్లో పరిస్థితి ఎలా ఉండొచ్చు?**


అంతర్జాతీయంగా ముడి చమురు, దిగుమతి చేసుకునే వంట నూనెల ధరలు తగ్గితేనే దేశీయ మార్కెట్లో ఉపశమనం లభించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అలాగే రుతుపవనాల రెండో దశ కూడా అనుకూలంగా లేకపోతే పప్పుధాన్యాలు, వంట నూనెల ధరలు పండుగల కాలంలో మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో రాబోయే నెలల్లో సామాన్యుడి వంటగది బడ్జెట్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గ్యాస్ సిలిండర్ ధరలు




ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(గురువారం) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఆగస్టు 6వ తేదీన తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.994.00గా, వరంగల్‌లో రూ.1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.950.00గా, విజయవాడలో రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉంది.

# భారీగా పెరిగిన బంగారం ధర



గోల్డ్ లవర్స్, ఆభరణాల కొనుగోలుదారులకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తూ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, ఆర్థిక అనిశ్చితుల ప్రభావంతో దేశీయంగా పసిడి ధరలు మళ్లీ రికార్డు స్థాయికి చేరుకునేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం 10 గ్రాములపై రూ.2,890 భారీగా పెరిగి.. రూ.1,49,730 మార్కుకు చేరింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం 10 గ్రాములపై రూ.2,650 ఎగబాకి, ప్రస్తుతం రూ.1,37,250 వద్ద నమోదైంది. ఇక కేజీ వెండి ధర ఎలాంటి తగ్గుదల లేకుండా రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది.

# ‘రాకా’ నాన్‌స్టాప్ షూటింగ్





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా విజువల్ వండర్ ‘రాకా’. గత ఏడాది ముంబైలో ప్రారంభమైన ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్, ఇప్పటివరకు ఎలాంటి విరామం లేకుండా ఒకే ప్రాంతంలో నాన్‌స్టాప్‌గా చిత్రీకరణ జరుపుకుంటూ టాలీవుడ్‌లోనే ఒక రికార్డును క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ బాధ్యతలను హాలీవుడ్ విఎఫ్ఎక్స్ స్టూడియో చూసుకుంటుండగా, వారి సాంకేతిక అవసరాలకు తగినట్లుగా ముంబైలో ఒక భారీ సౌండ్ స్టేజ్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. నిజానికి ఈ షూట్ ముందు దుబాయ్, ఇతర అంతర్జాతీయ లొకేషన్లలో ప్లాన్ చేసినప్పటికీ, ఇరాన్లో నెలకొన్న ఘర్షణలు, ఉద్రిక్తతల కారణంగా ఆ షెడ్యూళ్లను రద్దు చేయడం జరిగింది. దీంతో మేకర్స్ తమ పూర్తి దృష్టిని ముంబైలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్‌పైనే పెట్టి నాన్‌స్టాప్‌గా షూట్ చేస్తున్నారు.ప్రస్తుతం ‘రాకా’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. బన్నీ కేవలం చిన్నపాటి విరామాలు మాత్రమే తీసుకుంటూ నిరంతరాయంగా ఈ ప్రాజెక్ట్ కోసం శ్రమిస్తున్నారు. ఇందులో హీరోయిన్గా నటిస్తున్న బాలీవుడ్ భామ దీపికా పదుకోన్ కూడా తన భాగానికి సంబంధించిన షూటింగ్‌ను దాదాపు పూర్తి చేసేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ విజువల్ వండర్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ స్వరాలు సమకూరుస్తున్నారు. ముంబై సెట్‌లో సాగుతున్న ఈ భారీ షెడ్యూల్ మరో నాలుగు నెలల పాటు సుదీర్ఘంగా సాగనుంది. ఈ చిత్రాన్ని 2027లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ధనుష్ చిత్రంలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ..?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, దర్శకుడు పీ.ఎస్. మిత్రన్ కాంబినేషన్‌లో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనుండటంతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో ధనుష్‌కు జోడీగా నటించేందుకు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్‌తో చిత్ర బృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో మైథాలజికల్ జంగిల్ అడ్వెంచర్ ఎపిక్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో కరీనా కీలక పాత్రలో కనిపించే అవకాశముందని నివేదికలు చెబుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఆమె అధికారికంగా ఒప్పందంపై సంతకం చేయలేదని, ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే తొలిసారిగా ధనుష్-కరీనా కపూర్ జంట వెండితెరపై సందడి చేయనుంది.




# కొణిదెల రేర్ ఫిలిమ్ కాంబినేషన్..

మొదటిసారి వరుణ్ తేజ్ తన తండ్రి నాగబాబుతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్లు తెలిపి ఫ్యాన్స్‌ను ఆశ్చర్యపరిచాడు. వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘కొరియన్ కనకరాజు’. రిలీజ్‌కు సిద్ధమైన ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా.. తాజాగా ఎన్నారై అభిమానులతో జూమ్ ద్వారా జరిపిన సంభాషణలో వరుణ్ తేజ్ ఈ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, చెల్లి నిహారిక కొణిదెల నిర్మాతగా రాబోతున్న చిత్రం ‘బరి’. ‘కమిటీ కుర్రాళ్ళు’ ఫేమ్ యదు వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీలో తన తండ్రి నాగబాబు కూడా ఓ కీలకమైన పాత్రలో నటించబోతున్నారని తెలిపాడు వరుణ్. దీంతో ‘బరి’ సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఇక నాగబాబు నటుడిగా చిరంజీవి, రామ్ చరణ్, పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ నటించిన ఏదో ఒక సినిమాలో కనిపించారు. ఇప్పుడు మొదటి సారి తన కొడుకు వరుణ్ తేజ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండగా.. ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన ‘హ్యాండ్స్ అప్’ సినిమాలో వరుణ్ తేజ్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించాడు.

# గ్లామర్ డోస్ పెంచిన సోనమ్ బజ్వా..

పంజాబీ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న సోనమ్ బజ్వా మరోసారి తన గ్లామర్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.తాజాగా పార-ప్పుల్ కలర్ స్టైలిష్ టైట్ డ్రెస్‌లో, చేతిలో పింక్ కలర్ బ్యాగ్ పట్టుకుని ఆమె ఇచ్చిన పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. తన కురులను అందంగా ముఖంపై పడేలా కిందికి వదిలేయడంతో ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ వచ్చింది.సూపర్ హాట్ లుక్‌లో ఉన్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 1989 ఆగస్టు 16న ఉత్తరాఖండ్‌లో జన్మించిన సోనమ్‌ప్రీత్ బజ్వా, ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది.సినిమాల్లోకి రాకముందు ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసిన ఆమె, 2012 ఫెమినా మిస్ ఇండియా ఫైనలిస్ట్‌గా నిలిచింది.అనంతరం 2013లో ‘బెస్ట్ ఆఫ్ లక్’ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టి, ప్రస్తుతం పంజాబీ సినీ పరిశ్రమలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా కొనసాగుతోంది. పంజాబీతో పాటు హిందీ, తమిళం, తెలుగు చిత్రాల్లోనూ నటిస్తూ అభిమానులను అలరిస్తోంది.



# మైండ్ బ్లాక్ అయ్యే డీల్ ఫిక్స్




అక్కినేని నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘వృషకర్మ’. కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి పెద్దగా ప్రచార చిత్రాలు విడుదల కాకపోయినా, ‘విరూపాక్ష’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కార్తీక్ దండు దర్శకత్వంలో వస్తున్న చిత్రం కావడంతో ‘వృషకర్మ’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజ్ కారణంగా నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక ఓటీటీ డీల్ ఈ సినిమాకు కుదిరినట్లు ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అలాగే థియేట్రికల్ బిజినెస్‌పైనా మంచి డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ‘వృషకర్మ’ నైజాం థియేట్రికల్ హక్కులు భారీ ధరకు అమ్ముడైనట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. రాజుకుంట ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఈ సినిమా నైజాం ఏరియా థియేట్రికల్ హక్కులను రూ.15 కోట్ల భారీ మొత్తానికి దక్కించుకున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే నాగచైతన్య కెరీర్‌లోనే నైజాం ఏరియాలో అత్యధిక ధర పలికిన చిత్రాల్లో ‘వృషకర్మ’ మొదటి స్థానంలో నిలిచే అవకాశం ఉంది. అయితే ఈ డీల్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# దర్శకుడిగా విశాల్‌కు తొలి పరీక్ష..




తమిళ స్టార్ హీరో విశాల్ తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయబోతున్నారు. ఇప్పటివరకు హీరోగా ఎన్నో యాక్షన్ సినిమాలలో ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు దర్శకుడిగానూ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. విశాల్ దర్శకత్వం వహిస్తూ, ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మకుటం’ మూవీ 2026 ఆగస్టు 14న తెలుగు తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఈ రోజు రిలీజ్ డేట్ ను చిత్రబృందం ఆఫీషియల్ గా అనౌన్స్ చేసింది. అలాగే ఆగస్టు 7న ట్రైలర్ ను కూడా విడుదల చేయనున్నట్లు కూడా వెల్లడించింది. అంతేకాదు ఈ అప్డేట్ ను ఇస్తూ ‘కిరీటం సిద్ధం’ కాప్షన్ ను కూడా జోడించారు మేకర్స్. యాక్షన్, ఎమోషన్, రివేంజ్ ఎలిమెంట్స్ తో తెరకెక్కిన ఈ మూవీ విశాల్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్నారు.‘మకుటం’ కథ ప్రశాంతంగా జీవితం గడపాలనుకునే ఒక వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. అయితే నమ్మక ద్రోహం కారణంగా అతని జీవితం పూర్తిగా మారిపోతుంది. తాను దూరంగా ఉండాలనుకున్న హింసాత్మక వారసత్వాన్ని స్వీకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తన కుటుంబాన్ని నాశనం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునే ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు హీరో. ఎమోషన్స్ తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఈ మూవీలో హైలెట్ గా ఉండనున్నట్లు తెలుస్తోంది.ఈ మూవీలో విశాల్‌తో పాటు అంజలి, దుషారా విజయన్, జాన్ విజయ్, జయప్రకాష్, అజయ్, వంశీ కృష్ణ, అబు సలీం కీలక పాత్రల్లో నటించారు. మొదట ఈ సినిమాకు దర్శకుడు రవి అరసు బాధ్యతలు చేపట్టినప్పటికీ, కొన్ని విభేదాల కారణంగా ఆయన తప్పుకోవడంతో విశాల్ స్వయంగా దర్శకత్వం చేపట్టారు. దీంతో దర్శకుడిగా ఆయనకు ఇదే తొలి సినిమా కానుంది. కథకు రవి అరసు పేరు కొనసాగుతుండగా, స్క్రీన్‌ప్లేను విశాల్ రూపొందించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విశాల్ చివరిసారిగా సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ‘మధ గజ రాజా’ మూవీలో కనిపించారు. 2012లో పూర్తయిన ఈ సినిమా అనేక కారణాల వల్ల ఆలస్యంగా 2025లో విడుదలైనా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది.







# రాజమౌళికి ఫ్యాన్స్ రిక్వెస్ట్!

ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కలయికలో తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం ‘వారణాసి’. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ శరవేగంగా జరుగుతుండగా.. భారీ యాక్షన్ ఎపిసోడ్లను తెరకెక్కిస్తున్నాడు రాజమౌళి. ఇదిలా ఉంటే.. ఈ చిత్రం మరోసారి లీకుల బారిన పడింది. ఇప్పటికే మహేశ్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కలిసి నటించిన మొదటి షెడ్యూల్ క్లిప్ ఒకటి లీక్ అవ్వగా.. ఇప్పుడు మహేశ్ బాబు యాక్షన్ సన్నివేశానికి సంబంధించిన క్లిప్ నెట్టింట దర్శనమిచ్చింది. ఇందులో అతడి ఒంటి నిండా రక్తం, ఇప్పటి వరకు చూడని ఓ రేర్ పవర్ ఫుల్ లుక్‌లో మహేశ్ కనిపించడంతో ఆ క్లిప్‌ను నెట్టింట వైరల్ చేస్తున్నారు. అయితే.. లీక్ అయిన క్లిప్స్‌ను షేర్ చేస్తున్న కొన్ని అకౌంట్స్‌ను ఇప్పటికే బ్లాక్ చేసినట్లు తెలుస్తుండగా.. దీనిపై లీగల్ వార్నింగ్‌కు యూనిట్ సిద్ధమవుతున్నారట. ఇదంతా పక్కన పెడితే ఈ వరుస లీక్స్‌తో అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు.
అధికారిక గ్లింప్స్ విడుదల చేసి ఉంటే బాగుండేదని రాజమౌళిని ట్యాగ్ చేస్తూ రిక్వెస్టులు పెడుతున్నారు. మరి ఈ లీకులు ఇష్యూపై టీమ్ ఏ విధంగా రియాక్ట్ అవుతుందో వేచి చూడాల్సి ఉంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**